SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 87 | ఎడిటర్ : విక్రం కుమార్ | గురువారం 15 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి

మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు

2

- భోగిమంటలు వేసిన ప్రజలు.. వేడుకల్లో ప్రముఖులు
- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

2

తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగిమంటలు వేసి ఆనందంగా పండగను ప్రారంభించారు. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి.

## పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు

# శుభవార్త

### ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల నగదు జమ

### ఆనందం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

**అమరావతి :** సంక్రాంతి పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం బుధవారం చెల్లించింది. దీంతో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల ఖాతాల్లో భారీగా నగదు జమవుతోంది. దాంతో ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సంక్రాంతి పండగవేళ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతోపాటు కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లులు

మిగతా 5 లో



రాష్ట్ర ప్రజలకు చంద్ర బాబు సంక్రాంతి శుభాకాంక్షలు

పండగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్ష

2

## భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

- సంప్రదాయ ముగ్గుల పోటీలు.. ఎడ్ల బండ్లపై ఊరేగింపు
- స్థానిక చిన్నారులకు ఆటల పోటీలు.. పాల్గొన్న దేవాన్ష్
- గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా నారావారి పల్లె

సంస్కృతి, సంప్రదాయలు చాటి చెప్పేలా నారావారిపల్లిలో భోగి పండగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా పాల్గొంటున్నారు. వరుసగా రెండోరోజు తన స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు కుటుంబం పాల్గొంది.

5

## హ్యాపీ సంక్రాంతి

సంక్రాంతి పండుగ సందర్భంగా మన పత్రిక కార్యాలయానికి సెలవు. శుక్రవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

\- ఎడిటర్





# ఇరాన్‌ను వీడండి


## తక్షణమే ఇండియాకు వచ్చేండి

- అక్కడి భారతీయ పౌరులకు రాయబార కార్యాలయం అప్రమత్తం
- అందుబాటులో ఉన్న రవాణా మార్గాలను ఎంచుకోండి
- నిరసనలు, ఉద్రిక్తత నేపథ్యంలో సూచన

3

**ఇరాన్‌లో మారణ హోమం.. 2500 మందికి పైగా మృతి**

ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు, భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపార వేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయ బార కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.



2

## మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

### టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

**చట్టప్రకారమే అరెస్ట్**

విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా: సీపీ సజ్జనార్

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### 29మంది మావోల లొంగుబాటు

**రాయపూర్ :** మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుధ్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు

మిగతా 2 లో





2

## శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

- మార్మోగిన స్వామి శరణం నామస్మరణం
- పులకించిపోయిన అయ్యప్ప భక్తులు

శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు.

## గొంతుకోసిన చైనా మాంజా



- బైక్‌పై వెళుతుండగా చుట్టుకున్న మంజా
- తీవ్ర రక్త స్రావంతో అక్కడిక్కడే మృతి

2



# మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు

## టీవీ ఛానల్ జర్నలిస్టుల అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 14:** తెలంగాణలో ఓ మహిళా ఐఏఎస్ అధికారిని కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరపున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# చట్టప్రకారమే విలేకర్ల అరెస్ట్

## మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్



**హైదరాబాద్, జనవరి 14 :** ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు. అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం. త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్ట్ దుర్మార్గం

## పండగపూట కక్షసాధింపు చర్యలు తగవు.. హరీష్ రావు

**హైదరాబాద్,జనవరి14:** ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పాలన చేతగాని సర్కారు.. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటు అని విమర్శించారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా అని మండిపడ్డారు. ఇళ్లల్లో చొర బడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడి అని ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవంపై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడి అని అన్నారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా- డిజిటల్ మీడియాపై సిట్లతో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు? అని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ? అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, రిపోర్టుర్లు పరిపూర్ణచారి, సుధీర్‌ను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబంతో విదేశాలకు వెళ్తుండగా దొంతు రమేశ్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయగా.. మరో ఇద్దరు రిపోర్టర్లను సైతం అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఐఏఎస్, మంత్రి వార్త వ్యవహారంలో ఎన్టీవీ న్యూస్ ఛానల్‌పై చర్యలకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం.. ఈ మేరకు జర్నలిస్టులను అరెస్టు చేశారు.



# తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి



- భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు
- భోగి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు
- ఏపీలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు
- భారీగా తరలివచ్చిన వీక్షకులు
- ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి

**హైదరాబాద్, జనవరి 14:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

### భోగిమంటలు వేసిన రాష్ట్రాల ప్రజలు


తెలుగు రాష్ట్రాల్లో భోగి సంబరాలు మొదలయ్యాయి. హైదరాబాద్ తదితర గ్రామాల్లో ఉదయమే భోగిమంటలు వేశారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పెద్ద ఎత్తున భోగి జరుపుకున్నారు. ఏపీ వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల సంక్రాంతి పండుగలో తొలిరోజు భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ఇంటి ముంగిళ్లలో భోగి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసుకుంటూ ఆటపాటలతో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా గడిపారు . సూర్య భగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే సమయాన్ని 'మకర సంక్రాంతి' అని అంటారు. ఈ పండుగకు సరిగ్గా ఒక రోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారు. అలాగే భోగి రోజు సాయంకాలం సమయంలో బొమ్మల కొలువును కూడా జరుపుతారు. రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా భోగి సంబరాల్లో పాలుపంచుకున్నారు. విజయవాడలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# కుక్కలపై విషప్రయోగం

## ఏకంగా 600 కుక్కలు మృతి..

## ఐదుగురు సర్పంచ్‌లపై కేసులు

**కామారెడ్డి, జనవరి 14:** మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. ఈ ఘటన సంచలనం రేపుతోంది. పాల్వంచ, ఫరీద్‌పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి కుక్కలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్టే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

**తిరువనంతపురం, జనవరి14:** శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది.

# గొంతుకోసిన చైనా మాంజా

## వాహనదారుడు మృతి

**సంగారెడ్డి, జనవరి 14:** సంగారెడ్డి మండలం పసల్వాడి గ్రామంలో భయానక ఘటన చోటుచేసుకుంది. చైనా మాంజా మెడకు తగిలి గొంతు కోసుకుపోవడంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని బిహార్ కి చెందిన అద్వైక్‌గా గుర్తించారు పోలీసులు. కొంతకాలంగా అతడు పసల్వాడిలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం అతను బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా రోడ్డుకు అడ్డంగా వెళాడుతోంది. అది కంటికి కనిపించకపోవడంతో ఒక్కసారిగా అతని గొంతుకు చుట్టుకుని కోసేసింది. ఈ ప్రమాదంలో తీవ్ర రక్తస్రావంతో బాధితుడు ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకుండా పోయింది. మాంజా గొంతుకు లోతుగా కోసుకోవడంతో అద్వైక్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చైనా మాంజా వల్ల మనుషులు, పక్షులు, జంతువులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని ఇప్పటికే నిపుణులు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చైనా మాంజా విక్రయాలు కొనసాగుతుండటంతో అనేక మంది గాయపడుతున్నారు. కాగా.. తెలంగాణలో చైనా మాంజా విక్రయం, వినియోగం, రవాణా పూర్తిగా నిషేధించిన విషయం తెలిసిందే.



హైదరాబాద్‌లో పోలీసులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో రూ. 1.24కోట్ల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దాదాపు 143 మందిని అరెస్టు చేశారు. వేలాదిగా బాబిన్లను పట్టుకున్నారు. అటు సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లోనూ పోలీసులు తనిఖీలు చేసి.. చైనా మాంజా విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. చైనా మాంజాను పూర్తిగా నిషేధించాలని.. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయించినా, వినియోగించినా సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఛత్తీస్‌గఢ్‌లో 29 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఖమ్మం, జనవరి 14: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుధ్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాలను సరెండర్ చేశారు. పొడియం బుధ్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు



ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్భా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్లైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు. జనవరి 8న దంతేవాడలో 63 మంది సరెండర్ కాగా అంతకుముందు రోజున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 మంది లొంగిపోయారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజంను రూపుమాపాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.

# అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
- అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 14:** సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

# కాంగ్రెస్ నేతల అవకతవకలపై సిట్ వేయండి



- జర్నలిస్టులపైనే సిట్ ఎందుకు
- అన్నింటిపైనా దమ్ముంటే విచారణ జరపండి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్

**హైదరాబాద్, జనవరి 14:** జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమిషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమిషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమిషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.

# ఉత్సాహంగా సాగిన కైట్ ఫెస్టివల్

పరేడ్ గ్రౌండ్‌లో సందడిగా ఎగిరిన పతంగులు

## నోరూరించేలా స్వీట్ స్టాల్స్



**హైదరాబాద్,జనవరి14:** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 'అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ 2026' ప్రారంభమైంది. రంగురంగుల పతంగులతో భాగ్యనగర ఆకాశం ఒక అద్భుతమైన కాన్వాస్‌లా మారిపోయింది. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలో ప్రపంచం నలుమూలల నుంచి కైట్ ఫ్లయర్స్ తరలివచ్చారు. రష్యా, పోర్చుగల్,



సింగపూర్, శ్రీలంక, థాయిలాండ్, ఉక్రెయిన్, వియత్నాం, జపాన్, ఇటలీ, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా వంటి 19 దేశాల నుండి 40 మంది నిపుణులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అలాగే భారత దేశంలోని 15 రాష్ట్రాల నుండి 55 మంది జాతీయ స్థాయి కైట్ ప్లేయర్స్ పాల్గొని వైవిధ్యమైన పతంగులను ఎగురవేస్తున్నారు. భూమి నుండి ఆకాశానికి రంగురంగుల సందేశాలు పంపుతున్నారా అన్నట్టుగా గ్రౌండ్ అంతా పతంగులతో నిండి పోయింది. డాల్ఫిన్లు, కార్టూన్ క్యారెక్టర్లు, డ్రాగన్లు, భారీ ఆకారాల్లో ఉన్న గాలిపటాలు సందర్శకులను కట్టిపడేస్తున్నాయి. ఈ సందర్భంగా హైదరాబాద్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి ప్రజల ఉత్సాహం, ఆతిథ్యం అద్భుతం అని అంతర్జాతీయ ఫ్లయర్స్ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది మరికొన్ని పతంగులతో పాటు ప్రత్యేక ఆకర్షణలు కూడా తోడయ్యాయి. అక్కడ వివిధ రాష్ట్రాల సంప్రదాయ మిఠాయిల స్టాల్స్ ఆహార ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. జనవరి 16 నుంచి 18 వరకు పరేడ్ గ్రౌండ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్, అలాగే గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్ కూడా జరగనున్నాయి. ఇదిలావుంటే కైట్ ఫెస్టివల్‌కు తోడు స్వీట్ ఫెస్టివల్ కూడా అలరించింది. రకరకాల స్వీట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

# వ్యక్తిత్వ హననం జరిగితే సహించం

వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు వార్తలు సరికాదు

మహిళా ఐఎఎస్ కేసుపై డిజిపి శివధర్ రెడ్డి స్పందన



**హైదరాబాద్, జనవరి 14:** చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్ల లో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# జర్నలిస్టుల అరెస్టు దారుణం

విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు

రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో

మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి14(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

# ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టులు అక్రమం

తీవ్రంగా ఖండించిన ఏపీయూడబ్ల్యూజే

**విజయవాడ,జనవరి14:** ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టులను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వంపై విమర్శలు చేయడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మాత్రమే కారణంగా జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెర్చ్ వారెంట్ లేకుండా చానెల్ కార్యాలయంలోకి పోలీసులు ప్రవేశించి సోదాలు నిర్వహించడం పూర్తిగా అన్యాయమని అన్నారు. పండుగ సమయంలో అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల ఇళ్లలోకి వెళ్లి తలుపులు పగలగొట్టి అరెస్టులు చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. నిర్దిష్ట విధి విధానాలను పాటించకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు సుబ్బారావు.. ఇది పత్రికా స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించారు. జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. టెలికాస్ట్ అయిన వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఫిర్యాదు చేయాల్సిందే తప్ప జర్నలిస్టులను అరెస్టు చేయడం సరికాదన్నారు.. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్ సుధీర్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని ఏపీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది.

# ఎన్టీవీ జర్నలిస్ట్లు అరెస్టు తొందరపాటు చర్య

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





**హైదరాబాద్,జనవరి14:** ఎన్టీవీలో వచ్చిన ఓ కథనంపై రేవంత్ సర్కార్ ఓవర్ రియాక్షన్ చేస్తోంది. జర్నలిస్టులపై రేవంత్ సర్కార్ ప్రతాపంపై పౌరసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాజాగా ఎన్టీవీ జర్నలిస్టుల అక్రమ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఖండించారు. అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్ట్ చేయడం మంచిది కాదని హితవు పలికారు. నోటీసులు ఇచ్చి వ్యక్తిగతంగా వివరణ తీసుకుంటే బాగుండేదన్నారు. జర్నలిస్టుల అరెస్టులతో రాష్ట్రంలో యుద్ధ వాతావరణం ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. తెలంగాణ పోలీసుల చర్యలను ఖండిస్తున్నా.. తలుపులు బద్దలుగొట్టి దౌర్జన్యంగా బద్దలుగొట్టి ఇంట్లోకి వచ్చారు. పండగకు భార్యతో వెళ్తుండగా ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్‌ను లాక్కెళ్లడం సరికాదు. ప్రొసీజర్, నోటీసులు లేకుండానే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇది పార్టీకి, ప్రభుత్వానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

# జిల్లాలను మారిస్తే తీవ్ర పరిణామాలు

మాజీ స్పీకర్ మధుసూధనాచారి హెచ్చరిక

**హనుమకొండ,జనవరి14:** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు సోదా కిరణ్, నాయకులు ఇమ్మడి రాజు, శోభన్, సల్వాజీ రవీందర్ రావు, పానుగంటి శ్రీధర్, ఎండీ గౌస్‌ఖాన్, ఏలిషా, సౌరం రఘు, సంపతి రఘు, ఎస్కే మహిమూద్ పాల్గొన్నారు.




సంపాదకీయం

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం!


కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలికాం ముగిసిపోయి..వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయంనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు. సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడింది. తెలుగు రాష్టాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు. అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్పృహతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు. కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి.ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు,బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది.పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్నపదమని నమ్మకం.ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్ష్మజీవు లను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపస్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.

# అమెరికాలో చేరేది లేదు

## గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్



**కోపెన్‌హాగెన్, జనవరి 14:** అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.




# మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జనవరి 14:** ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు మరియు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి –సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత మరియు మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.

# మరోమారు రాజ్యసభకు నో

## దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన



**భోపాల్, జనవరి 14:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్‌వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది.షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు. 1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

# ఆరోపణలు సులువే.. ఆధారాలెక్కడ!

## కెనడాపై భారత రాయబారి ఫైర్



**ఢిల్లీ, జనవరి 14:** ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కెనడా 40 ఏళ్లుగా విఫలమవుతూనే ఉందని అక్కడి భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ అన్నారు. అందువల్లే భారత్ వ్యతిరేక కుట్రలకు ఒట్టావా కేంద్రంగా మారుతోందని విమర్శించారు. కెనడా మీడియా సంస్థ సీబీసీకి దినేశ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటన ప్రస్తావనకు రాగా.. ఈ కేసులో భారత్‌పై కెనడా ఆరోపణలను ఆయన మరోసారి తిప్పికొట్టారు. "కెనడా గడ్డ నుంచి జరుగుతోన్న ఉగ్ర కుట్రల గురించి మేం 40 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. ఉగ్రవాద కట్టడికి ఈ దేశ నేతలెవరైనా చర్యలు చేపట్టారా? ఈ కేసుల్లో (ఎయిరిండియాపై బాంబు దాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ) కనీసం ఒక్కరికైనా శిక్ష పడిందా? కెనడా ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోంది. ఉగ్రవాదుల గురించి భారత్ లేవనెత్తినప్పుడు ఆధారాలు కావాలని డిమాండ్ చేస్తోంది. మరి మా దేశంపై కెనడా ఆరోపణలు చేసినప్పుడు కూడా (నిజ్జర్ హత్య కేసు విషయంలో) ఆధారాలు చూపించాలి కదా. ఆరోపణలు చేయడం సులువే. ఆ ఘటనలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని చెప్పేందుకు కచ్చితమైన సమాచారం ఉందని పదే పదే చెబుతోంది. మరి అందుకు తగిన ఆధారాలెక్కడ?" అని భారత రాయబారి ప్రశ్నించారు. నిజ్జర్ హత్య కేసు కు సంబంధించి కెనడాలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదైందని, ఇప్పటివరకు భారత ప్రభుత్వంపై ఎలాంటి అభియోగాలు లేవని దినేశ్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. నిజ్జర్ హత్య కేసులో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర ఉందంటూ గతంలో కెనడా చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య విభేదాలు రాజుకున్న సంగతి తెలిసిందే.

# ఇరాన్‌ను తక్షణమే వీడండి

## భారతీయులకు విదేశాంగశాఖ హెచ్చరిక



**న్యూఢిల్లీ, జనవరి 14:** ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు, భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు.ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..

## ఇరాన్‌లో మారణ హోమం

### 2500 మందికి పైగా మృతి..

**ఢిల్లీ, జనవరి 14:** ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం, అవినీతికి వ్యతిరేకంగా శాంతియుతంగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నిరసనల కారులకు, భద్రతా దళాలకు మధ్య జరుగుతున్న పోరు మారణ హోమానికి కారణమైంది. ఆందోళనకారులను అణిచివేసేందుకు భద్రతా దళాలను ప్రభుత్వం రంగంలోకి దింపడం పెను విధ్వంసానికి దారి తీసింది. గత మూడు వారాలుగా ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మరణించినట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ ఆందోళనల్లో ఇప్పటివరకు 2,571 మంది మృతి చెందారని, వారిలో 2,403 మంది ఆందోళనకారులని, 147 మంది భద్రతా సిబ్బంది అని అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల సంస్థ ప్రకటించింది. ఈ ఘర్షణలతో ఏమాత్రం సంబంధం లేని 12 మంది చిన్నారులు, 9 మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్టు సదరు సంస్థ వెల్లడించింది. అలాగే ఇప్పటివరకు 18 వేల మంది నిరసనకారులను ఇరాన్ భద్రతా దళాలు అరెస్ట్ చేశాయి. కాగా, ఇరాన్‌లో ఆందోళనలను మరింతగా రెచ్చగొట్టేలా డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఆందోళనలు చేస్తూనే ఉండాలని, ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సాయం అందించేందుకు వస్తున్నామని హామీనిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలతో అమెరికా సైనిక చర్యకు సిద్ధమైందనే సంకేతాలు అందినట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రంప్‌గానీ, వైట్‌హౌజ్ వర్గాలు గానీ దీనిపై ఇప్పటివరకు ఏ స్పష్టతా ఇవ్వలేదు.



# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

## మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, జనవరి 14 (సమయం న్యూస్):** జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పదో వార్డుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలింగ్ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, దివ్యాంగుల కోసం ర్యాంపులు, వృద్ధులు సులభంగా చేరుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమబెంగాల్ అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**హన్మకొండ, జనవరి 14 (సమయం న్యూస్):** హన్మకొండలో పట్ట పగలు దొంగతనాలకు పాల్పడుతున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను సీసీఎస్, కేయూసీ పోలీసులు అదుపులోకి తెచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌జిల్లా ముజ్ పార గ్రామానికి చెందిన ఫెరోజ్ షేక్, సుక్ చంద్, యామీన్ ను పట్టుకున్నారు. వారి నుంచి 15 తులాల బంగారు నగలు, 5.5 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మద్యం, హెరాయిన్, మత్తు పదార్థాలకు అలవాటు ఉన్న నిందితులు.. జల్సాలకు సులువుగా డబ్బులు సంపాదించడానికి పట్ట పగలు చేసుకుని ఇండ్ల తాళాలను పగలగొట్టి బంగారు, వెండి నగలను దొంగిలించేవారు. వీరు పశ్చిమబెంగాల్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, మహారాష్ట్రలో పాతగా దొంగతనాలకు పాల్పడిన నిందితులు, పలు సార్లు అరెస్టు అయ్యి జైల్‌కు వెళ్లారు. రెండు నెలల క్రితం ముజ్ పార పోలీసులు అరెస్ట్ చేసిన తరువాత, తిరిగి ముఠాగా ఏర్పడి తెలంగాణలో దొంగతనాలకు ప్రయత్నించగా, పోలీసులు ముందస్తు దర్యాప్తు చేసి వారిని పట్టుకున్నారు. ఈ నెల 10న హన్మకొండలో గోపాలపురం, శివ సాయి కాలనీ ప్రాంతాల్లో రెండు ఇండ్ల తాళాలను పగలగొట్టి 15 తులాల బంగారు, 5 తులాల వెండి నగలను దొంగిలించారు. నిందితుల నుండి రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీసీఎస్ఇన్‌స్పెక్టర్‌కే రామకృష్ణ, కేయూసీఇన్‌స్పెక్టర్ ఎస్‌రవి కుమార్, ఐటీ కోర్ టీమ్ ఏఏవో ఎండీ సల్మాన్ పాషా, సీసీఎస్ఎస్సైలు రాజ్ కుమార్, సాయి ప్రసన్న కుమార్, శ్రీనివాస రాజు, హెడ్ కానిస్టేబుల్లు కే మహేశ్వర్, వీ జంపయ్య, కానిస్టేబుళ్లు టీ మధుకర్, బీ చంద్రశేఖర్, ఎస్‌రాములు, జీ ఉపేందర్, కే వంశీ, జీ విశ్వేశ్వర్, జీ వినోద్ ను వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ



**నారాయణపేట, జనవరి,14(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని యాదగిరి రోడ్‌లో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు దొంగతనాలు, అక్రమ కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం నుండి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతోందని, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న 26 వాహనాలను గుర్తించి, వాటిపై మొత్తం రూ. 21,500/- జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, సరైన నెంబర్ ప్లేట్, వాహన పత్రాలు వెంట ఉంచుకోవడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రతి వాహనదారుడు బాధ్యతగా నడుచుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులను విడుదల చేయాలి

- అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టును ఖండిస్తున్నాం
- తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

**హైదరాబాద్, జనవరి 14 (సమయం న్యూస్):** ఎన్‌టీవీ జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్లను అర్ధరాత్రి సమయంలో పోలీసులు అరెస్టు చేయడాన్ని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండిస్తోందని సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులు గానీ, మీడియా సంస్థ గానీ నిరాధారమైన లేదా అసత్య వార్తలు ప్రసారం చేస్తే ముందుగా ఖండన కోరే అవకాశం ఉందని, ఆ తర్వాత కూడా స్పందన లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. అయితే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి సమయంలో జర్నలిస్టులను అరెస్టు చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. అరెస్టు చేసిన ముగ్గురూ జర్నలిజంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్టులని, వారి అరెస్టును టీయూడబ్ల్యూజే పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, టీఈఎంజేయూ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రమణ కుమార్ పేర్కొన్నారు.

### జర్నలిస్టులకు సంఘం సూచన

ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఒక సూచన కూడా చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారుల విషయంలో నిరాధారమైన వార్తలను ప్రసారం లేదా ప్రచురించరాదని, సరైన ఆధారాలు ఉన్నప్పుడే వార్తలు ఇవ్వాలని సూచించారు. అలాగే ఎవరైనా వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వార్తలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా మీడియా సంస్థలదేనని పేర్కొన్నారు. ఏది ఏమైనా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం, అర్ధరాత్రి పూట తీవ్రవాదుల మాదిరిగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అరెస్టు చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# దేవరకద్రకు అభివృద్ధి బాట





- పలు అభివృద్ధి పనులకు మంత్రులు కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి శంకుస్థాపనలు

**దేవరకద్ర, జనవరి 14 (సమయం న్యూస్):** దేవరకద్ర పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి కలిసి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, పేదలు, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు ఇప్పటికే రూ.6 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోసం ఏటా 10వేల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా 20వేల కోట్లతో రైతు రుణమాఫీ అమలు చేశామని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో రూ.20 వేల కోట్లతో యంగ్ ఇండియా సమగ్ర నివాస పాఠశాలలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.7లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించిన మంత్రి, ఆ అప్పులను చెల్లిస్తూ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీపై మాట్లాడుతూ, ఆ పార్టీని విమర్శించాల్సిన అవసరం తమకు లేదని, ప్రజలే తగిన తీర్పు ఇస్తారని వ్యాఖ్యానించారు. 2019లో కాంగ్రెస్ 3 పార్లమెంట్ స్థానాలు గెలిచిందని గుర్తు చేసిన ఆయన, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలుచుకోలేదన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అన్ని మున్సిపాలిటీల్లో గెలిపిస్తే ప్రజల కోసం మరింత బలంగా పనిచేసే అవకాశం లభిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు










**సిద్దిపేట, జనవరి 14 (సమయం న్యూస్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సిద్ధిపేట జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన నియమాలు, నిబంధనలను ప్రతిబింబించే విధంగా వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదన్న అవగాహన, రాంగ్ రూట్ డ్రైవింగ్ నివారణ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదన్న అంశాలను చిత్రాల రూపంలో విద్యార్థులు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ పి. శంకర్ నారాయణ మాట్లాడుతూ, పిల్లలు వేసిన ముగ్గులు వారి ప్రతిభకు నిదర్శనంగా ఉండటంతో పాటు పెద్దలకు కూడా రహదారి భద్రత, ప్రాముఖ్యతను గుర్తు చేస్తున్నాయని అన్నారు. సంక్రాంతి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ఏ కుటుంబంలోనూ రహదారి ప్రమాదం వల్ల విషాదం నెలకొనకూడదని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను చిత్తశుద్ధితో పాటించి ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అలాగే జిల్లా ఆర్టీఏ మెంబర్ డాక్టర్ లక్కరసు సూర్య చంద్ర వర్మ మాట్లాడుతూ, రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. ఈ విషయాన్ని పిల్లలు తమ ముగ్గుల ద్వారా సమర్థంగా చాటిచెప్పారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు, అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాస్మా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు జే. మల్లారెడ్డి, టీపీఎస్ఏ అధ్యక్షుడు భగవాన్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పి. శంకర్ నారాయణ, ఆర్టీఏ మెంబర్ డాక్టర్ సూర్య వర్మ, అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్ రవీందర్, హోంగార్డులు వెంకట్ రామేశ్వర్, అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో సంక్రాంతి ఉత్సవాలు

## చిన్నారులతో పతంగులు ఎగురవేసిన పోచారం శ్రీనివాసరెడ్డి



**బాన్సువాడ, జనవరి 14 (సమయం న్యూస్):** సంక్రాంతి పండుగ సంబరాలలో భాగంగా బాన్సువాడ పట్టణంలోని వీక్లీ మార్కెట్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్ (పతంగుల పండుగ) ఘనంగా నిర్వహించారు. దీనికి రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజుతో కలిసి ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. చిన్నారులతో కలిసి పతంగులు ఎగురవేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ నుంచి పండరిపూర్ కు పాదయాత్రగా వెళ్తున్న భక్తుల బృందానికి పాత బాన్సువాడ హనుమాన్ మందిర్ వద్ద జెండా ఊపి పోచారం, బాలరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంక్రాంతి ఉత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.





# భోగి పండుగకు ఐనవోలు శైవక్షేత్రం కళకళ

● బ్రహ్మోత్సవాల్లో మంత్రి కొండ సురేఖ



**ఐనవోలు, జనవరి 14 (సమయం న్యూస్):** భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ--ధర్మాదాయ, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కొండ సురేఖకు ఆలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. తీర్థ-ప్రసాదాలను సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రత వంటి మౌలిక సదుపాయాలు సమృద్ధిగా అందుతున్నాయా లేదా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అలాగే ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు బస్సులో ప్రయాణించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ, భోగి పర్వదినాన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధి, బ్రహ్మోత్సవాలు, జాతరల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, భోగి పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం తెలంగాణకే కాక దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రాచీన శైవక్షేత్రమని తెలిపారు. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. భోగి పండుగ పాత కష్టాలను విడిచిపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కలగాలని, వర్ధన్నపేట నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో సీఎం బహిరంగ సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మంత్రి జూపల్లి కృష్ణారావు



**నిర్మల్, జనవరి 14 (సమయం న్యూస్):** నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి (జిల్లా ఇన్‌చార్జి మంత్రి) జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టిన ఏర్పాట్ల వివరాలను కలెక్టర్ మంత్రికి వివరించారు. సభ నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అంతకుముందు, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పట్టణానికి చేరుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిఅబశ్రీశ్రీలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అటవీ శాఖ అతిథి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూ-ర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసులు మంత్రికి, ప్రభుత్వ సలహాదారుకు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ సాయికిరణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వైద్యులు సమయపాలన పాటించాలి

**మెదక్ జనవరి14( సమయం న్యూస్):** వైద్యాధికారులు సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిత తనిఖీ చేసి అనంతరం నూతనంగా నిర్మిస్తున్న సిహెచ్సి హాస్పటల్ ను పరిశీలించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత నాణ్యమైన వైద్యం అందాలని, వైద్యుల సమయపాలన పాటించాలని, మందులన్నీ అందుబాటులో ఉండాలన్నారు. నూతనంగా నిర్మించిన పిహెచ్ఎస్సి త్వరగా పూర్తి చేసి ప్రజల సేవలకు అందుబాటులో తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నవీన విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర

**కొడంగల్ మున్సిపల్, జనవరి 14 (సమయం న్యూస్):** కొడంగల్‌లోని నవీన ఆదర్శ హైస్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయుల బృందంతో విజయవంతంగా విజ్ఞాన విహారయాత్ర పూర్తి చేశారు. ఈ యాత్రలో విద్యార్థులు మహబూబ్‌నగర్‌లోని పిల్లల మ్యూజియం, జిల్లా సైన్స్ మ్యూజియం, మయూరి పార్క్, కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్, కోయిలకొండ, మన్యంకొండ, వనపర్తిలోని పాంపురం, శ్రీరంగాపురం, గద్వాల జిల్లాలోని గద్వాల్ కోట, బీచుపల్లి కృష్ణానది, జూరాల ప్రాజెక్ట్, అల్లంపూర్ జోగులాంబ తుంగభద్రా నది వంటి వివిధ పర్యాటక ప్రదేశాలను తిలకించి వచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ నరేష్‌రాజ్ మాట్లాడుతూ, ఈ విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులు, నిర్మాణాలు, చరిత్ర, ప్రకృతి వనరులు గురించి ఫస్ట్‌హ్యాండ్‌గా తెలుసుకోవడం ద్వారా పెద్దగా ఉపయోగపడిందని తెలిపారు. విద్యార్థులు పాఠశాల నుంచి వెలువడే సాంఘిక, శాస్త్రీయ, భౌగోళిక జ్ఞానాన్ని సులభంగా అర్థం చేసుకోవడం ఈ విహారయాత్ర ముఖ్య ఉద్దేశ్యం అని ప్రిన్సిపాల్ తెలిపారు.




# 15 కోట్లతో మధిర అభివృద్ధి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**మధిర , జనవరి 14 (సమయం న్యూస్):** 15 కోట్ల రూపాయల వ్యయంతో మధిర పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మధిర పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగి పండుగ నాడు మధిర పట్టణ అభివృద్ధి కోసం 15 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని, వీటిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధిర పట్టణ ప్రజలకు మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఓ ఏ. శ్రీనివాస్, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మధిర మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, పంచాయతీ రాజ్ ఇఇ మహేష్ బాబు, మధిర మండల తహసీల్దార్ రాంబాబు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భోగి మంటల్లో పాల్గొన్న కలెక్టర్ కుటుంబ సభ్యులు

**భూపాలపల్లి, జనవరి 14 (సమయం న్యూస్):** భోగి పండుగను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటల్లో పాల్గొని పండుగను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వెలిగించి, పాత ఆలోచనలు, అరిష్టాలను దూరం చేసి, కొత్త ఆశయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భోగి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకోవడం వల్ల ఐక్యత, ఆనందం మరింత పెరుగుతాయని తెలిపారు. రైతన్నల కష్టానికి గౌరవం తెలిపే పండుగగా భోగిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సతీమణి, తల్లిదండ్రులు తదితర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# హెచ్‌టీ పత్తి విత్తనాలు వాడొద్దు

**నారాయణపేట, జనవరి 14 (సమయం న్యూస్):** ప్రస్తుతం కొంతమంది రైతుల మధ్య హెర్బిసైడ్ టాలరెంట్(హెచ్‌టీ) పత్తి విత్తనాల గురించి అపోహలు వ్యాప్తి చెందాయని నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జాన్ సుధాకర్ తెలిపారు. రైతులు ఈ విషయంపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ప్రభుత్వం ద్వారా ఇప్పటివరకు బీజీఅబశ్రీశ్రీఅబశ్రీశ్రీ--2/బీటీ--2 మాత్రమే అనుమతించబడ్డాయని తెలిపారు. హెచ్‌టీ పత్తి విత్తనాలకు భారత ప్రభుత్వం లేదా జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ ఎటువంటి అనుమతీ ఇవ్వలేదని, ఈ విత్తనాల విక్రయం, నిల్వ, వినియోగం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. హెచ్‌టీ పత్తి విత్తనాలు ఉపయోగిస్తే పంట ఉత్పత్తి ఆశించిన స్థాయిలో రాదని, పంట నష్టాలు వస్తాయని, అధిక ఖర్చులు అవుతాయని చెప్పారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేని హెచ్‌టీ పత్తి విత్తనాలను కొనుగోలు చేయవద్దని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ అధికారుల సూచనల ప్రకారం మాత్రమే విత్తనాలను ఉపయోగించాలని సూచించారు. అనధికారికంగా హెచ్‌టీ విత్తనాలను విక్రయించడం లేదా నిల్వ చేయడం దొంగతనంగా పరిగణించబడతుందని, విత్తనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ విషయంపై ఏవైనా సందేహాలున్నా, రైతులు తమ మండల వ్యవసాయ అధికారులను లేదా జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవలసిందని జిల్లా వ్యవసాయాధికారి పేర్కొన్నారు.

# రోడ్డు భద్రతపై రంగవల్లులు




**జనగామ, జనవరి 14 (సమయం న్యూస్):** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా జనగామ జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రంగవల్లుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే విధంగా వివిధ రకాల రంగవల్లులను ప్రదర్శించారు. రోడ్డు భద్రత నిబంధనల పాటింపు, ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ అవసరం వంటి అంశాలను రంగవల్లుల రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని, ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు.

# కింగ్ కోఠి ఆస్పత్రికి జర్నలిస్టుల తరలింపు

## అక్రమ అరెస్టుపై దొంతు రమేష్ తీవ్ర వ్యాఖ్యలు

**హైదరాబాద్, జనవరి 14 (సమయం న్యూస్):** ఎన్టీవీ సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేష్, సుధీర్‌లను కింగ్ కోఠి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీసులు అదుపులో ఉన్న సమయంలోనే వీరిని ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు దొంతు రమేష్ స్పందిస్తూ, తమ అరెస్టు పూర్తిగా అక్రమమని ఆరోపించారు. విచారణను న్యాయబద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. సిట్ అధికారులు అడ్డదిడ్డంగా ప్రశ్నలు అడిగారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని విమర్శించారు. ఈ అక్రమ అరెస్టుపై కోర్టులోనే తేల్చుకుంటామని దొంతు రమేష్ తెలిపారు.

# తలసానిపై పోలీస్ కేసు నమోదు



**హైదరాబాద్,జనవరి14 :** మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి నేత తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి తలసాని చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రవికిరణ్ దేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఆర్ నగర్ పోలీసులు తెలిపారు.



# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

**మంత్రి గడ్డం వివేకానంద**

**మంచిర్యాల, జనవరి 14 (సమయం న్యూస్):** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు--భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. నివాసాలకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్ఫార్మర్లు ఇతర ప్రాంతాలకు మార్చేలా త్వరలోనే చర్యలు చేపడతామని వెల్లడించారు. అమృత్ పథకం కింద క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ పథకంలో చేపట్టిన పనులు దాదాపు 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను త్వరలో పూర్తి చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచుతూ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా అందని రేషన్ కార్డులను పేదలను గుర్తించి అందించామని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రతినెల సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల నుంచి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నగర అభివృద్ధి నిధులు మంజూరు చేసి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, అదనంగా డీఎంఎఫ్టీ, సిఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ వార్డుల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి టియూఎఫ్ఐడీసీ, నగరాభివృద్ధి నిధులతో చేపట్టిన పలు పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు నిర్వహించినట్లు వివరించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ప్రజల సౌకర్యార్థం రూ.57 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో రహదారులు--భవనాలు (ఎలక్ట్రికల్) శాఖ ద్వారా ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థను ప్రారంభించినట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పడిపోయిన టమోటా ధరలు

**మదనపల్లె మార్కెట్‌లో కిలో 25కే విక్రయం**



**మదనపల్లె, జనవరి 14:** మదనప్లలెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మంగళ వారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, వారం రోజులుగా రేట్లు రోజు రోజుకు తగ్గు ముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని, ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటుతుండడంతో వినియోగదారులు బేంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఈ ధర మరింత ఎక్కువగా తీసుకుంటున్నారు. ఈ ధరలవల్ల పంట పండించే రైతు తీవ్రంగా నష్టపోతుండగా వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు బాట ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి కోరుతున్నారు.

# రైలు నుంచి కిందపడి ఆర్మీ జవాన్ మృతి

**వరంగల్, జనవరి 14:** రైలు ప్రయాణంలో ప్రమాదవశాత్తు జారిపడి భారత సైన్యంలో సుబేదార్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకి చెందిన సంతోష్ కుమార్ (48) పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఇండియన్ ఆర్మీ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన ఆయన న్యూఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే అండమాన్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 16032)లో ప్రయాణిస్తున్నారు. అదే రోజు రాత్రి 10:40 గంటల సమయంలో రైలు కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్యకు రాగానే సంతోష్ కుమార్ ప్రమాదవశాత్తు రైలు నుండి కిందకు జారిపడ్డారు. ఈ ప్రమాదంలోఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు వరంగల్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుని వద్ద లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసి, మృతదేహాన్ని ఎంజీఎం దవాఖాన మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం**



**భూపాలపల్లి, జనవరి 14 (సమయం న్యూస్):** మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం దేవాలయ ఈఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఆర్కిటెక్చర్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి అంత్య పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. గత పుష్కరాల సమయంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 30.16 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఇందులో రూ. 16 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సంబంధిత శాఖలు అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని, ఫిబ్రవరి మొదటి వారంలోపు టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా శాశ్వత పనులు చేపట్టాలని, పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కాళేశ్వరానికి వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక వాతావరణం కల్పించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, భక్తుల భద్రతపై ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తామని, వాహనాల నియంత్రణకు డ్రాప్ గేట్లు, మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ధార్మిక సలహాదారు గోవింద హరి మాట్లాడుతూ, సరస్వతి అంత్య పుష్కరాలను ఆది పుష్కరాల మాదిరిగానే అత్యంత వైభవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. అంత్య పుష్కరాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న దేవాదాయ శాఖ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా త్వరలోనే "కాళేశ్వర ఖండం" పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. పీఠాధిపతులు, హారతి, తాత్కాలిక ఏర్పాట్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ మాయం సింగ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మేడారం మహాజాతరకు డిజిటల్ దారి

**7658912300 నంబర్ సేవ్ చేసుకోండి!**



**హైదరాబాద్ (సమయం న్యూస్):** మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'మై మేడారం' పేరుతో ప్రత్యేక వాట్సాప్ సేవలను ప్రారంభించింది. ఈ సేవలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రవాణా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. భక్తులు 7658912300 నంబర్‌కు వాట్సాప్‌లో సందేశం పంపితే మేడారం మహాజాతరకు సంబంధించిన పలు కీలక వివరాలను క్షణాల్లో పొందవచ్చని మంత్రులు తెలిపారు. రూట్ మ్యాపులు, మరుగుదొడ్ల లొకేషన్లు, వైద్య శిబిరాలు, ట్రాఫిక్ సమాచారం వంటి వివరాలు ఈ సేవ ద్వారా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే మహాజాతరలో తప్పిపోయిన వారి సమాచారం, ఫిర్యాదుల నమోదు, అత్యవసర సేవల వివరాలు కూడా ఈ వాట్సాప్ సేవ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు. భక్తుల సౌకర్యార్థం ఈ సేవలను వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు వాట్సాప్‌లోనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మేడారం మహాజాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు ఈ డిజిటల్ సేవలు ఎంతో ఉపయోగకరంగా నిలవనున్నాయని మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల అరెస్టులు ప్రజాస్వామ్యంపై దాడి

**వైఎస్ జగన్ తీవ్ర ఖండన**



**అమరావతి (సమయం న్యూస్):** జర్నలిస్టుల అరెస్టులను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. పండగ పూట అర్ధరాత్రి సమయంలో జర్నలిస్టుల ఇళ్ల తలుపులు పగలగొట్టి, నోటీసులు కూడా ఇవ్వకుండా బలవంతంగా అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. జర్నలిస్టులు నేరస్థులు కాదని, ఉగ్రవాదులు అసలే కాదని స్పష్టం చేసిన వైఎస్ జగన్, ప్రజాస్వామ్యంలో మీడియా కీలకమైన నాలుగో స్థంభమని గుర్తు చేశారు. మీడియా గొంతును నొక్కే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకే జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని విమర్శించారు. భయభ్రాంతులకు గురి చేసి మీడియాను మౌనం చేయాలనే ఉద్దేశంతోనే ఈ అరెస్టులు జరిగాయని ఆరోపించారు. అరెస్టు చేయబడిన జర్నలిస్టులను వెంటనే, షరతులు లేకుండా విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జర్నలిస్టుల హక్కుల కోసం తాము నిరంతరం పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

# గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,జనవరి14:** హైదరాబాద్‌లో మరోసారి భారీ అగ్ని ప్రమాదం కలకలం రేపింది. మంగళవారం రాత్రి కూకట్‌పల్లి రాజీవ్ గాంధీ నగర్‌లోని ఓ గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్యాస్ రీఫిల్లింగ్ జరుగుతున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైరిరజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. మంటలు ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిసిపడటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్ సమీపంలోని ప్రజలను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు. ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పినట్లు అధికారులు తెలిపారు. అయితే ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగింది అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.




# తొమ్మిది కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

**ప్రధాని ప్రశంసలు**

**న్యూఢిల్లీ, జనవరి 14 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యం, రైలు కనెక్టివిటీని మరింత మెరుగుపరచడంలో కొత్తగా ప్రారంభిస్తున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కీలక ముందడుగుగా నిలుస్తాయని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వివిధ మార్గాల్లో తొమ్మిది కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జెండా ఊపి ప్రారంభించిన నేపథ్యంలో, రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స'లో చేసిన థ్రెడ్‌కు స్పందించిన ప్రధాని, ఈ రైళ్ల ద్వారా కలిగే విస్తృత ప్రయోజనాలను వివరించారు. ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరచడమే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంలో ఈ రైళ్లు కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని తెలిపారు. అలాగే, ఈ కొత్త రైలు సేవలు వాణిజ్యం, పర్యాటక రంగాల అభివృద్ధికి కూడా దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సందర్భంగా రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఆధునిక ప్రయాణికుల రైళ్ల నెట్‌వర్క్‌ను మరింత విస్తరిస్తూ, తొమ్మిది కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రైలు సేవల ద్వారా అస్సాం రాష్ట్రం హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో అనుసంధానమవుతుందని తెలిపారు. అలాగే, పశ్చిమ బెంగాల్‌ను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో కలుపుతూ తూర్పు, ఉత్తర, దక్షిణ, పశ్చిమ భారత ప్రాంతాల మధ్య అంతర్-రాష్ట్ర రైలు కనెక్టివిటీ మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు. రైల్వే శాఖ మంత్రి చేసిన 'ఎక్స' థ్రెడ్‌కు స్పందించిన ప్రధాని నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు: "కొత్త అమృత్ భారత్ రైళ్లు ప్రయాణికుల సౌకర్యం, కనెక్టివిటీని మెరుగుపరచడంలో కీలక ముందడుగు. వీటి ద్వారా వాణిజ్యం, పర్యాటక రంగాలు కూడా మరింతగా ప్రోత్సహితమవుతాయి."



## బట్టుపల్లిలో ఘనంగా స్వేరో సర్కిల్

**సమయం న్యూస్, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లి గ్రామంలో సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు స్వేరో సర్కిల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్వేరో అధ్యక్షులు డోంగ్రి సురేష్, ఉపాధ్యక్షులు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టుపల్లి గ్రామ సర్పంచ్ రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు పార్వతి అంజన్న, వార్డ్ మెంబర్ వెంకటేష్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. స్వేరో ఉద్యమం ద్వారా సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. స్వేరో సర్కిల్ ద్వారా గ్రామ స్థాయిలో ప్రజా చైతన్యం పెంపొందించి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సెలవుల్లో భద్రత చర్యలు చేపట్టాలి




**సమయం న్యూస్, కాగజ్‌నగర్:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఊరికి వెళ్లే ప్రజలు తగిన భద్రత చర్యలు చేపట్టాలని కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్ అన్నారు. జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఆటో ద్వారా అనౌన్స్ మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వేళ ప్రజలు స్వగ్రామాలకు, దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే సమయంలో ఇళ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రయాణానికి వెళ్లే ముందు తమ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని, ఇళ్లకు పక్కా తాళాలు వేసి భద్రత కల్పించాలని తెలిపారు. విలువైన వస్తువులు, నగదు, బంగారాన్ని ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపర్చాలని పేర్కొన్నారు. పొరుగువారికి, సమీప బంధువులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయాలని, అవసరమైతే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించి సంక్రాంతి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమకుమార్, ఎస్సైలు సుధాకర్, లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్మీ వెటరన్స్ డే




**సమయం న్యూస్, కాగజ్‌నగర్:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె శివకుమార్ ఆధ్వర్యంలో ఆర్మీ వెటరన్స్ డే వేడుకల బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్, చాయ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు నివాళులు అర్పించడమే కాకుండా, పూర్వ సైనికుల సేవలను గుర్తించే రోజు ఆర్మీ వెటరన్స్ డే అని తెలిపారు. భారత సాయుధ దళాల తొలి కమాండర్ ఇన్ చీఫ్ ఫీల్డ్ మార్షల్ కెఎం కరియప్ప ఉద్యోగ విరమణ చేసిన రోజును పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 14న ఈ వేడుకను జరుపుకుంటామని వివరించారు. దేశం కోసం సైనికులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. సైనికుడు ఎప్పటికీ సైనికుడేనని, యూనిఫాం విడిచినా దేశం పట్ల వారి నిబద్ధత మారదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పీయూష్ మండల్, విశ్వజిత్, ఎ కృష్ణా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ పైప్ లైన్ మరమ్మత్తు



**సమయం న్యూస్, బెజూర్:** మిషన్ భగీరథ నీళ్లు రాక మండలంలోని తలాయి గ్రామస్తులు గత కొన్ని రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పైప్‌లైన్ మరమ్మతు చేయించాలని స్థానిక సర్పంచ్ సడమేక సాయికిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం గ్రామపంచాయతీ సిబ్బంది స్థానిక ప్రజలతో కలిసి మిషన్ భగీరథ పైప్ లైన్ ను మరమ్మతు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. పైప్ లైన్ మరమ్మత్తు అనంతరం గ్రామంలో భగీరథ నీళ్లు రావడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆఖరి మజిలీలోనూ 'కోనప్ప' అండ

**వందమందికి ఉచితంగా కట్టెల పంపిణీ**



**సమయం న్యూస్, బెజ్జూర్ :** జీవితం ఎలా సాగినా, ఆఖరి మజిలీ గౌరవప్రదంగా సాగాలనేది హిందూ ధర్మం చెప్పే మాట. ఆ ఆఖరి మజిలీలో పేదలకు ఎలాంటి కష్టం రాకూడదనే ఉద్దేశంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేపట్టిన సేవా కార్యక్రమం నేడు ఒక మైలురాయిని చేరుకుంది. మండల కేంద్రంలోని ఆయన నివాసం వద్ద నిర్వహిస్తున్న ఉచిత కట్టెల పంపిణీ కార్యక్రమం ద్వారా నేటితో 100 మందికి అంతిమ సంస్కారాల కోసం కట్టెలను అందజేయడం విశేషం.

### సమస్యను గుర్తించి.. అండగా నిలిచి..

కౌటాల సమీపంలో అడవి లేక మృతుల అంతిమ సంస్కారాలకు కట్టెలు దొరకక స్థానికులు ఇబ్బందులు పడేవారు. గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితిని గమనించిన ప్రజలు సమస్యను కోనప్ప దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన, 2025 జూన్ 9వ తేదీన ఉచిత కట్టెల పంపిణీకి శ్రీకారం చుట్టారు.

### మైలురాయిని చేరిన సేవ

గడిచిన ఏడు నెలలుగా సుమారు 25 గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలకు ఈ సేవలు అందుతున్నాయి. బుధవారం ముత్తంపేట గ్రామానికి చెందిన డోంగ్రి శేఖర్ మరణించడంతో, ఆయన అంతిమ సంస్కారాల కోసం కట్టెలను పంపిణీ చేశారు. దీనితో ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారి సంఖ్య వందకు చేరింది.

### అందరి సహకారంతో..

అటవీ శాఖ అనుమతులతో పాటు రైతులు, స్థానికులు, విజయనగరం చర్చి యాజమాన్యం, బాలాజీ అనుకోడా చర్చి యాజమాన్యం సహకారంతో ఈ మహత్కార్యాన్ని కోనప్ప నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న కుటుంబాలకు భారం తగ్గించేలా ఆయన చేస్తున్న ఈ కృషిపై ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# పోటీల్లో పాల్గొని సత్తా చాటాలి

**వాంకిడి సర్పంచ్ చునార్కర్ సతీష్**





**సమయం న్యూస్, వాంకిడి:** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, నిర్వహించే ఏ పోటీలలోనైనా పాల్గొని తమలోని సత్తాను చాటుకోవాలని వాంకిడి గ్రామ సర్పంచ్ చునార్కర్ సతీష్, ఉపసర్పంచ్ దీపక్ ముండే అన్నారు. బుధవారం వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ, సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నామాంతర్ దివస్, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.

### ముగ్గుల పోటీలకు విశేష స్పందన

నామాంతర్ దివస్ సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలకు మంచి స్పందన లభించింది. ఈ పోటీలలో మొత్తం 20 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్, సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్, వాంకిడి గ్రామ సర్పంచ్ చునార్కర్ సతీష్, ఉపసర్పంచ్ దీపక్, నాయకులు దుర్గం తిరుపతి, దుర్గాజి, ఉప్రే జయరాం, దుర్గం సునీల్ కుమార్, శ్యామ్ రావు, రాజేశ్వర్, రోషన్, విలాస్, రామ బాయి మహిళా మండలి సభ్యులు, సిద్ధార్థ యువజన సంఘం సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు.

# పండగపూట విషాదం

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి**



**సమయం న్యూస్, బెజ్జూర్:** సంక్రాంతి పండగ పూట విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన బెజ్జూర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కౌటాల మండలం ముత్తంపేటకు చెందిన డోంగ్రి శేఖర్ 3 రోజుల క్రితం బెజ్జూర్ మండలం కుంటలమానేపల్లి పంచాయతీ దుబ్బగూడాలో తన బంధువుల ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం కుంటలమాలపల్లి నుంచి సలుగుపల్లి గ్రామానికి చికెన్ తీసుకురావడానికి బయల్దేరినట్లు తెలిపారు. అతని మామ బోరుకుట్ శంకర్ సలుగుపల్లి నుంచి తిరుగు ప్రయాణంలో కుంటల మానేపల్లి సమీపంలోని మూలమలుపు వద్ద గల వంతెన పైనుంచి వారి ద్విచక్ర వాహనం పడి డోంగ్రి శేఖర్ సంఘటన స్థలం వద్ద మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న శంకర్‌ను 108 వాహనంలో కాగజ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పండగ రోజు ప్రశాంత వాతావరణంలో గడపాల్సిన కుటుంబం ఇద్దరినీ కోల్పోయి శోకసంద్రమైంది. కుటుంబ సభ్యుల రోధనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆహ్వానించిన శ్రీ గురుదేవ్ సేవాశ్రమ్ కమిటీ సభ్యులు



**సమయం న్యూస్, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలోని శ్రీ గురుదేవ్ సేవాశ్రమ్ (మహగాం) ఆధ్వర్యంలో నిర్వహించనున్న అఖండ హరినామ సప్తాహం, శ్రీ సంత్ సురోజీ మహరాజ్ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ కమిటీ సభ్యులు బుధవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాయకులతో కలిసి కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సెడ్మాకి జానేరావు, సార్మెడి ఆత్రం అనంద్ రావు, మాజీ గ్రంథలయ సంస్థ చైర్మన్ కనక యాధవరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంతియాజ్ లాలా, జైనూర్ సర్పంచ్ కోడప ప్రకాష్, నాయకులు మడవి కౌసల్య, మడవి సోంబాయి, ఆత్రం తులసి, మాజీ సర్పంచ్ మడవి భీంరావు, నాయకులు ఆత్రం శంకర్, మెస్రం శ్రీకాంత్, విశాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



## తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి

**సమయం న్యూస్, హైదరాబాద్ :** ఎన్టీవీ జర్నలిస్టుల అరెస్టును తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ వసీమ్ బుధవారం ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి అరెస్టులు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వంపై వచ్చే విమర్శలను సహించలేక మీడియా గొంతు నొక్కడం సిగ్గుచేటని, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపై కక్ష సాధింపులు తగదని హితవు పలికారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపడతామని, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడే పోరాటంలో జర్నలిస్టులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# రాష్ట్ర అభివృద్ధే ధ్యేయం

### కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద





**సమయం న్యూస్, మంచిర్యాల:** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలుచేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని వార్డులలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ వార్డుల్లో నివాసాలకు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను వేరే ప్రదేశాలకు మార్చేలా త్వరలోనే పనులు చేపడతామని అన్నారు. అమృత్ పథకం క్రింద క్యాతనపల్లి మున్సిపాలిటీకి రూ.40కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ఈ పథకంలో చేపట్టిన పనులు దాదాపు 50 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే మిగిలిన పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. గత 10 సంవత్సరాల కాలంలో అందని రేషన్ కార్డులను ప్రభుత్వం పేద ప్రజలను గుర్తించి అందించడం జరిగిందని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రతినెల సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వచ్చే నెల నుంచి అర్హత గల లబ్ధిదారులకు పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీకి అభివృద్ధి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కిష్టంపేటలో భోగి సంబరాలు



**సమయం న్యూస్, తాండూర్:** మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలోని తాండూర్ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం కాలనీ వాసులు భోగి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రంగులవళ్ళుల మధ్యలో భోగి మంట ఏర్పాటు చేసి భోగ భాగ్యాలనిచ్చే భోగి, సరదా సంక్రాంతి, పండగ కొత్త సంవత్సరంలో సరికొత్తగా అందరికీ ఆనందాన్ని పంచాలని కోరుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీలోని యువకులు, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# డీఎస్పీగా పదోన్నతి పొందిన చంద్రశేఖర్‌ను సన్మానం



**సమయం న్యూస్, గంభీరావుపేట:** మండలంలోని నర్మాల గ్రామానికి చెందిన మరాఠి పోసి రాజా చంద్రశేఖర్ ఇటీవల ఎక్సైజ్ శాఖలో సీఐ హోదా నుంచి డీఎస్పీగా పదోన్నతి పొందారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామం నర్మాలకు వచ్చిన ఆయనను ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రత్నాకర్, రాజు, స్వామి, నవీన్, ధోని, నర్సింలు, మధు, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 22న విద్యా సంస్థలకు సెలవు

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**సమయం న్యూస్, ఆదిలాబాద్:** ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో నిర్వహించే చారిత్రాత్మక నాగోబా జాతర ప్రజా దర్బార్‌ను పురస్కరించుకుని ఈనెల 22న జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షిషా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివాసీల ఆరాధ్యదైవం, ఆసియాలోనే రెండవ అతిపెద్ద గిరిజన జాతర సందర్భంగా మెస్రం వంశీయుల విజ్ఞప్తి మేరకు జాతర విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలకు సెలవు ఉంటుందని, ఈ సెలవుకు బదులుగా, మార్చి 14న రెండవ శనివారం రోజున జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు పని చేయాల్సి ఉంటుందని వివరించారు.



# సంక్రాంతి క్రీడల సందడి



**సమయం న్యూస్, గంభీరావుపేట:** సంక్రాంతి పండగను పురస్కరించుకొని నర్మాల గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. గ్రామ యువత శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండడంతో పాటు గ్రామాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించేందుకు ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యమని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన అంజనేలు, ఉప సర్పంచ్ గొర్రె సుదర్శన్, వార్డు సభ్యులు పాల్గొని పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామ యువత ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ నెలకొంది.

# చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరిపై కేసు



**సమయం న్యూస్, ఆదిలాబాద్:** చైనా మాంజా విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూ టౌన్ ఇంచార్జి సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి వద్ద దాదాపు రూ.8వేల విలువ గల రెండు చైనా మాంజా చరకాలు, 14 ప్యాకెట్ల చైనా మాంజా లభించినట్లు పేర్కొన్నారు. అతనిపై టూటౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. చైనా మాంజాతో ప్రజలకు, పక్షులకు ప్రాణహాని కలుగుతుందని, ప్రజలు చైనా మాంజాను వినియోగించవద్దని సూచించారు.



# ముగిసిన వాలీబాల్ క్రీడాలు

**సమయం న్యూస్, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ఏటిగూడా గ్రామంలో బుధవారం గ్రామ యువత ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దలు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు పోకుండా క్రీడలపై మక్కువ చూపెట్టేందుకు ప్రతి సంవత్సరం సంక్రాంతికి మొదటిరోజు గ్రామంలో వాలీబాల్ టోర్నిమెంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ టోర్నిమెంట్ లో పలు జట్లు పాల్గొనగా, విజయతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగిందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహదారుఢ్యం మెరుగుపడుతుందని, స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తూ ఆటలు ముగించిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సడమేక రాకేష్, గ్రామస్తులు తుమ్మల రవీందర్, శ్రీకాంత్, జలపతి, రాకేష్, పోషణ, శంకర్, శ్రీనివాస్, విలాస్, అశోక్, రమేష్, విలకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 16న ఉచిత దంత వైద్య శిబిరం

**సమయం న్యూస్, బెజ్జూర్:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఈనెల 16న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలంగాణ డెంటల్ అసోసియేషన్ సెక్రెటరీ సామల రసజ్ఞ ఒక ప్రకటనలో తెలిపారు. కీర్తి డెంటల్ క్లినిక్ కాగజ్ నగర్ సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, బెజ్జూర్ సర్పంచ్ సరోజ దుర్గం తిరుపతి, తెలంగాణ డెంటల్ అసోసియేషన్ చైర్మన్ మణిదీప్ బలుసాని, సెక్రటరీ సామల రసజ్ఞ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

# ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



**సమయం న్యూస్, బెజ్జూర్:** మండలంలోని సులుగుపల్లి గ్రామపంచాయతీలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐకేపీ ఏపీఎం రత్నం మోహన్ దాస్, సులుగుపెల్లి సర్పంచ్ సోయం చిన్నయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ కలలకు ప్రతీక ముగ్గుల పోటీ కార్యక్రమం అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, సమాజంలో పోటీ తత్వాన్ని ఎదుర్కోవడానికి ఈ పోటీలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ముగ్గులు వేసిన అనంతరం ఉత్తమ వాటిని ఎంపిక చేసి, మొదటి బహుమతి రూ.2వేలు కర్పెత భవాని, రెండవ బహుమతి రూ.1500 కోసారి విద్య, మూడవ బహుమతి రూ.వెయ్యి సిడం కవితలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోయం విజయలక్ష్మి, సీడం జ్యోతి, దుర్గం రవి ప్రసాద్, డోంగ్రాజ్ చిత్రు, ఆత్రం రామయ్య, గ్రామ పెద్దలు కరిపిత రామయ్య, మాజీ వీఎస్ఎస్ అధ్యక్షులు సీడం ఫకీర్, బోర్కుట్ ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రైలు నుంచి కిందపడి ఒకరి మృతి



**సమయం న్యూస్, తాండూర్:** రైలు నుంచి కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్పీ ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 07.30 గంటల సమయంలో గుర్తు తెలియని 45 సంవత్సరాల వ్యక్తి రైలు నుంచి పడినట్లు సమాచారం అందినట్లు తెలిపారు. కేఎం నం. 229/25-27 ఆప్ లైన్, బీడీ లైన్ మధ్య రెచిని రోడ్-ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ల మధ్య తలపగిలి గాయపడి ఉండగా 108 అంబులెన్స్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 08.55 గంటలకు మృతిచెందినటుల వైద్యులు ధ్రువీకరించారు. మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లభించకపోగా, మృతుడు ఎరుపు రంగు బనియాన్, ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని బెల్లంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి మార్చూరిలో భద్రపర్చడం జరిగిందన్నారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వి వెంకటయ్య ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే సెల్ నం.8712658601, 9849198382లపై సమాచారం అందించాలని కోరారు.

# కబడ్డీ పోటీల్లో తాండూర్ జట్టు విజయం

**సమయం న్యూస్, తాండూర్:** సంక్రాంతి సంబరాల్లో భాగంగా తాండూర్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కబడ్డీ, ముగ్గు, తాడు గుంజుడు పోటీలను బుధవారం నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో తాండూర్ టీం ప్రథమ బహుమతి సాధించగా, జట్టు కెప్టెన్ చైతన్యకు షీల్డ్ తో పాటు నగదు బహుమతి, అలాగే రెండవ జట్టు శివాజీ నగర్ యూత్ విన్నర్ గా గెలుపొందగా కెప్టెన్ ప్రణయ్ కు నగదుతో పాటు షీల్డ్ ను విజేతలకు నిర్వాహకులు అందజేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీలు ముగిశాయి. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి నిర్వాహకులు శాఖ బహుమతులు అందజేయడంతో పాటు క్రీడాకారులందరికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ డాక్టర్ సత్యం, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, మంతెనా శివకృష్ణ, ముస్కే సాగర్, శ్రీధర్, విష్ణు, క్రీడాకారులు పాల్గొన్నారు.





## టాప్‌లోకి దూసుకెళ్లిన
# విరాట్ కోహ్లీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్? ప్లేస్?కు చేరుకున్నాడు. ప్రస్తుతం విరాట్ 785 రేటింగ్స్?తో నెం.1 ర్యాంక్?లో ఉన్నాడు. గత నాలుగేళ్లలో వన్డే ర్యాంకింగ్స్?లో నెం.1 పొజిషన్?కు చేరుకోవడం విరాట్?కు ఇదే తొలిసారి. అతడు చివరిసారిగా 2021 జులైలో వన్డేల్లో నెం1 ర్యాంక్? సాధించాడు. న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ 784 రేటింగ్స్‌తో రెండు స్థానంలో ఉన్నాడు. టాప్?లో విరాట్‌కు, డారిల్ మిచెల్?కు ఒకే రేటింగ్ పాయింట్ తేడా ఉండడం గమనార్హం. ఇక స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ టాప్ నుంచి మూడో ప్లేస్‌కు పడిపోయాడు. గత కొన్నిరోజులుగా వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ టాప్‌లో ఉన్నాడు. అయితే రీసెంట్‌గా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో రోహిత్ స్వల్ప స్కోర్‌కే ఔటయ్యాడు. అదే సమయంలో విరాట్ గత ఐదు వన్డే మ్యాచ్‌ల్లో 50ం స్కోర్లు సాధించాడు. దీంతో కోహ్లీ ఒక స్థానం మెరుగుపర్చుకోగా, రోహిత్? రెండు స్థానాలు దిగజారాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 775 రేటింగ్స్?తో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. BCCI Pగతేడాది సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో విరాట్ అత్యుత్తం ప్రదర్శన చేశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో విరాట్ రెండు సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సహా 303 పరుగులు చేసి ఔరా అనిపించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డ్ దక్కింది. అంతకుముందు ఆస్ట్రేలియా సిరీస్‌లో మూడో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. ఇక ప్రస్తుతం కివీస్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ తొలి మ్యాచ్‌లో విరాట్ 93 పరుగులతో రాణించాడు. తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. అలా విరాట్ ఆడిన ఆఖరి 5 వన్డేల్లో అన్నింట్లోనూ 50ం స్కోర్లు చేశాడు. బౌలింగ్ విభాగానికి వస్తే, టాప్ 5 స్థానాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టాప్?లోనే ఉన్నాడు. అతడు 710 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (670 రేటింగ్స్) రెండో ప్లేస్?లో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో టీమ్ఇండియా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మూడో స్థానంలో ఉన్నాడు. కాగా, రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో విరాట్ నిరాశ పర్చాడు. ఈ మ్యాచ్‌లో 29 బంతులు ఆడిన అతడు 23 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇందులో 2 ఫోర్లు ఉన్నాయి. మరో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరాడు . అతడు 24 పరుగులు చేసి ఔటయ్యాడు.

# లీగ్ నుంచి తప్పుకున్న మొహమ్మద్ రిజ్వాన్

బిగ్ బాష్ లీగ్‌లో భాగంగా సిడ్నీ థండర్ వర్సెస్ మెల్బోర్న్ రెనెగేడ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ హై డ్రామా చోటుచేసుకుంది. మెల్బోర్న్ తరపున ఆడుతున్న రిజ్వాన్, క్రీజులో సెట్ అయినప్పటికీ పరుగులు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడాల్సిన సమయంలో ఆయన సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. రిజ్వాన్ 23 బంతుల్లో కేవలం 26 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్సర్) మాత్రమే చేశాడు. ఆయన స్ట్రైక్ రేట్ కేవలం 113 దగ్గరే ఆగిపోవడంతో, స్కోరు బోర్డు వేగం మందగించింది. ఇన్నింగ్స్ 18 ఓవర్లు ముగిసే సమయానికి మెల్బోర్న్ జట్టు 154/5 స్కోరుతో ఉంది. ఇంకా కేవలం 12 బంతులు మాత్రమే మిగిలి ఉండటంతో, క్రీజులో పవర్ హిట్టర్లు ఉండాలని కెప్టెన్ విల్ సదర్లాండ్ భావించారు. డగౌట్ నుంచి సిగ్నల్ రావడంతో, రిజ్వాన్ ఎటువంటి గాయం లేకపోయినప్పటికీ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. నిబంధనల ప్రకారం దీనిని 'రిటైర్డ్ అవుట్‌గా పరిగణిస్తారు. ఇలా బీబీఎల్ చరిత్రలో బలవంతంగా రిటైర్డ్ అవుట్ చేయబడిన మొదటి విదేశీ ఆటగాడిగా రిజ్వాన్ నిలిచాడు. రిజ్వాన్ స్థానంలో స్వయంగా కెప్టెన్ విల్ సదర్లాండ్ క్రీజులోకి వచ్చాడు. అయితే ఈ 'మాస్టర్ ప్లాన్ణ ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సదర్లాండ్ ఎదుర్కొన్న మొదటి బంతికే రన్ అవుట్ అయి పెవిలియన్ చేరాడు. చివరి రెండు ఓవర్లలో రెనెగేడ్స్ జట్టు కేవలం 16 పరుగులు మాత్రమే జోడించగలిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 170 పరుగులు చేసింది. లక్ష్య ఛేధనలో సిడ్నీ థండర్ డీఎల్ఎస్ పద్ధతిలో విజయం సాధించింది. ఈ సీజన్‌లో మొహమ్మద్ రిజ్వాన్ ప్రదర్శన నిరాశాజనకంగా ఉంది. ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌ల్లో ఆయన కేవలం 167 పరుగులు మాత్రమే చేశాడు. ఆయన ఓవరాల్ స్ట్రైక్ రేట్ 101 గా ఉండటం టీ20 ఫార్మాట్‌లో ఆందోళన కలిగించే అంశం. ఈ అవమానకర ఉదంతంతో పాకిస్థాన్ సెలెక్టర్లు రిజ్వాన్‌ను రాబోయే టీ20 వరల్డ్ కప్ జట్టులోకి తీసుకోవడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆధునిక టీ20 క్రికెట్‌లో స్ట్రైక్ రేట్ అనేది ప్రాణవాయ-ువు వంటిది. ఎంతటి స్టార్ ప్లేయర్ అయినా వేగంగా ఆడకపోతే జట్టు నుంచి పక్కకు తప్పుకోవాల్సిందేనని రిజ్వాన్ ఉదంతం మరోసారి నిరూపించింది.

# రెండో వన్డేలో టీమిండియా ఓటమి

- కేఎల్ రాహుల్ సెంచరీ వృథ
- రెండో వన్డేలో భారత్‌పై 7 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- అద్భుత సెంచరీతో కివీస్‌ను గెలిపించిన డారిల్ మిచెల్ (131లి)
- టీమిండియా తరపున కేఎల్ రాహుల్ (112లి) శతకం వృథ
- విఫలమైన రోహిత్, కోహ్లీ..
- రాణించిన శుభ్‌మన్ గిల్ (56)
- బౌలింగ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు







న్యూజిలాండ్ తో జరిగిన రెండో వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. డారిల్ మిచెల్ (117 బంతుల్లో 131 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగడంతో, టీమిండియా నిర్దేశించిన 285 పరుగుల లక్ష్యాన్ని కివీస్ సునాయాసంగా ఛేదించింది. కివీస్ 47.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. భారత జట్టులో కేఎల్ రాహుల్ (112 నాటౌట్) అజేయ సెంచరీ వృథ అయింది. రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, కేఎల్ రాహుల్ శతకం, శుభ్‌మన్ గిల్ (56) అర్ధశతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (24), విరాట్ కోహ్లీ (23), శ్రేయస్ అయ్యర్ (8) వంటి కీలక బ్యాటర్లు విఫలం కావడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 285 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, 46 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్, విల్ యంగ్ (87)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 162 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ నుంచి లాగేసుకున్నారు. విల్ యంగ్ ఔటయ్యాక, గ్లెన్ ఫిలిప్స్ (32 నాటౌట్)తో కలిసి మిచెల్ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. కివీస్ విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం అయింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 18న ఇందోర్ లో జరగనుంది.

## ప్రపంచకప్ స్క్వాడ్‌లో రోహిత్, కోహ్లీలకు చోటు



భారత క్రికెట్ అభిమానులకు ఒక తీపి కబురు. టీమ్ ఇండియా దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై గత కొంతకాలంగా సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. 2027లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు పాల్గొంటారా లేదా అన్న సందేహాలపై టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్‌కోట్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న రెండో వన్డేకు ముందు ఆయన మీడియాలో మాట్లాడుతూ, రోహిత్-కోహ్లీలు 2027 వరల్డ్ కప్ రోడ్‌మ్యాప్‌లో అంతర్భాగమని స్పష్టం చేశారు. "రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు కేవలం ఆటగాళ్లు మాత్రమే కాదు, వారు టీమ్ మేనేజ్‌మెంట్ వ్యూహాల్లో కీలక భాగస్వాములు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో వారు నిరంతరం వన్డే ఫార్మాట్ గురించి, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో జరిగే 2027 వరల్డ్ కప్ ప్రణాళికల గురించి చర్చిస్తున్నారు" అని కోటక్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. గంభీర్ ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న వార్తల్లో నిజం లేదని, వారు అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ అని, జట్టును ఎలా ముందుకు తీసుకెళ్లాలో వారికి బాగా తెలుసని ఆయన పేర్కొన్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో జరగనుంది. దక్షిణాఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై యువ ఆటగాళ్లు తడబడే అవకాశం ఉంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కోహ్లీ, రోహిత్ వంటి అనుభవజ్ఞులైన ఆటగాళ్లు ఉంటేనే భారత్ విజయావకాశాలు మెరుగుపడతాయని మాజీ క్రికెటర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం వారు ఆడుతున్న తీరు, చూపిస్తున్న ఫిట్‌నెస్ ప్రకారం 2027 వరకు వారు ఆడటం ఏమాత్రం కష్టం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం భీకరమైన ఫామ్‌లో ఉన్నాడు. గత ఐదు వన్డేల్లో వరుసగా 50 కంటే ఎక్కువ పరుగులు చేసి ప్రపంచ నంబర్ 1 ర్యాంకింగ్ సొంతం చేసుకున్నాడు. అటు రోహిత్ శర్మ కూడా వన్డేల్లో తన దూకుడును కొనసాగిస్తున్నాడు. టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, వారిద్దరి పూర్తి ఫోకస్ ఇప్పుడు కేవలం వన్డే ఫార్మాట్‌పైనే ఉంది. ఇది జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్ అని కోచ్ అభిప్రాయపడ్డారు.

## ఆయుష్ బదోని ఎంపిక సరికాదు

**మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్**



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయంతో దూరమవ్వగా.. అతని స్థానంలో ఢిల్లీ ప్లేయర్ ఆయుష్ బదోనిని సెలెక్టర్లు ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపికను మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుబట్టాడు. ఇది సరైన ఎంపిక కాదని విమర్శించాడు. దేశవాళీ క్రికెట్‌లో అతని ప్రదర్శన మెరుగ్గా లేకున్నా..ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించాడు.'ఒకరి విషయంలో పరుగులు చేస్తేనే జట్టులో చోటు అంటున్నారు. మరొకరి విషయంలో మాత్రం పరుగులు చేయకున్నా జట్టులోకి తీసుకుంటున్నారు. ఐపీఎల్‌లో బదోని ఆడిన అద్భుత ఇన్నింగ్స్ ఏదైనా ఉంటే చెప్పండి. ఐపీఎల్ ప్రదర్శనను వన్డేలకు ప్రామాణికంగా తీసుకోకూడదు. అతను కేవలం మూడు వికెట్లు తీసుకున్నంత మాత్రాన ఆల్‌రౌండర్ అవుతాడా? అతను ఐపీఎల్‌లో ఎన్నిసార్లు బౌలింగ్ చేశాడు. అతను బౌలింగ్ చేయడం ఎవరైనా చూశారా?'అని క్రిష్ శ్రీకాంత్ సెలెక్టర్లను ప్రశ్నించాడు. రుతురాజ్ గైక్వాడ్ ఏం పాపం చేశాడని కూడా శ్రీకాంత్ నిలదీసాడు. 'గత వన్డే సిరీస్‌లో రుతురాజ్ గైక్వాడ్ సెంచరీ చేశాడు. కానీ అతన్ని ఎంపిక చేయలేదు. అతను ఏం తప్పు చేశాడు? ఒక వేళ ఆల్‌రౌండర్ అవసరమైతే అక్షర్ పటేల్‌ను తీసుకోవాల్సింది.'అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో ఆయుష్ బదోని కనీసం 1000 పరుగులు కూడా చేయలేదని, అతని ఖాతాలో వికెట్లు కూడా ఎక్కువగా లేవని ఆకాశ్ చోప్రా విమర్శించాడు. నితీష్ కుమార్ రెడ్డిని జట్టులోకి తీసుకోని అవకాశాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాడు. అతన్ని చివర్లో బ్యాటింగ్‌కు పంపించడం, కొన్ని ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేయించడం సరికాదన్నాడు. అయితే ఈ విమర్శలకు టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ సమాధానమిచ్చాడు. భారత్-ఏ తరఫున మెరుగైన ప్రదర్శన చేయడంతోనే బదోనిని తీసుకున్నామని స్పష్టం చేశాడు. ఐపీఎల్‌లోనూ అతను మెరుగ్గా రాణించాడని గుర్తు చేశాడు. బదోని జట్టులోకి వచ్చిన న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో అతనికి అవకాశం దక్కలేదు. సుందర్ స్థానంలో నితీష్ రెడ్డిని ఆడించారు.

## సరికొత్త రికార్డ్ సృష్టించిన హర్మన్‌ప్రీత్

మహిళల ప్రీమియర్ లీగ్?లో ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హర్మన్?ప్రీత్ కౌర్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. తాజాగా గుజరాత్ జెయింట్స్?తో జరిగిన మ్యాచ్?లో 193 పరుగుల భారీ ఛేదనలో అదిరే ఇన్నింగ్స్?తో హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?' అవార్డు దక్కించుకుంది. 43 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఈ క్రమంలోనే డబ్ల్యూపీఎల్?లో హర్మన్ అరుదైన రికార్డు తన పేరిట లిఖించుకుంది. ఆ రికార్డు ఏంటంటే? హర్మన్?ప్రీత్ ఈ ఎడిషన్?లో సూపర్ ఫామ్?లో దూసుకుపోతోంది. దీంతో మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో ఇప్పటికే అత్యధిక పరుగులు బాదిన భారత క్రికెటర్?గా నిలిచిన హర్మన్, తాజాగా మరో ఘనత సాధించింది. గుజరాత్?తో మ్యాచ్?లో సూపర్ ఇన్నింగ్స్?తో ఆమె డబ్ల్యూపీఎల్?లో 1000 పరుగులు మైలురాయి అందుకుంది. 55 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద హర్మన్ ఈ మైలురాయి అందుకుంది. దీంతో ఈ టోర్నీ హిస్టరీలో ఈ ఘనత సాధించిన భారత తొలి క్రికెటర్?గా హర్మన్ రికార్డులకెక్కింది. ఇక తాజా మ్యాచ్?లో హర్మన్ 71 పరుగులతో రాణించింది. ఈ క్రమంలోనే ఆమె మెగ్ లానింగ్, ఎల్లిస్ పెర్రీలను అధిగమించింది. ఓవరాల్?గా డబ్ల్యూరీపీఎల్?లో అత్యధిక పరుగులు బాదిన రెండో క్రికెటర్?గా హర్మన్ కొనసాగుతోంది. ఆమె ఇప్పటిదాకా 30 మ్యాచ్?ల్లో 46.18 సగటుతో 1016 పరుగులు చేసింది. ఇందులో 10 హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. 95 పరుగులు అత్యధిక స్కోర్?గా ఉంది. ముంబయి జట్టుకే చెందిన నాట్? సీవర్?బ్రంట్ 1101 పరుగులతో ఈ లిస్ట్?లో టాప్?లో ఉంది. కాగా, ఈ సీజన్?లో అత్యధిక పరుగుల నమోదు చేసిన బ్యాటర్?గానూ హర్మన్ టాప్?లో కొనసాగుతోంది. ఇప్పటిదాకా మూడు మ్యాచ్?ల్లో ఆమె 165.00 యావరేజ్?తో 165 పరుగులు చేసింది. ఆర్సీబీతో ఆడిన తొలి మ్యాచ్?లో 20 పరుగులకే వెనుదిరిగిన ఆమె, తర్వాత వరుసగా 74 పరుగులు (దిల్లీ క్యాపిటల్స్), 71 పరుగులు (గుజరాత్?) రెండు భారీ హాఫ్ సెంచరీలు నమోదు చేసింది. ఈ లిస్ట్?లో తర్వాత స్థానాల్లో సోఫీ డివైన్ (141), అష్లీ గార్డ్?నర్ (134) ఉన్నారు. ఇప్పటిదాకా ప్రస్తుత ఎడిషన్?లో ఆరు మ్యాచ్?లు ముగిశాయి. ఇక మ్యాచ్? విషయానికొస్తే, గుజరాత్?పై ముంబయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 193 భారీ ఛేదనలో హర్మన్?తోపాటు అమన్?జోత్ కౌర్ (40 పరుగులు, 26 బంతుల్లో), నికోల కెరీ (38 పరుగులు, 23 బంతుల్లో) రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 192-5 భారీ స్కోర్ చేసింది. బెత్ మూనీ (33), కనికా అహుజా (35), జార్జి వేర్?హామ్ (43), భార్తి ఫుల్మాలి (36) ఆకట్టుకున్నారు.

# హాస్యం చుట్టూ తిరిగిన కథ అనగనగా ఒకరాజు

## సంక్రాంతికి నవ్వులు పండించిన నవీన్ పోలిశెట్టి



నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజుఅంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గ్గటెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్థంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్థంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్థం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీ-యార్థంలో ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్థంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.

# మన శంకరవరప్రసాద్ కలెక్షన్ల దూకుడు

### రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక.. కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు



ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజూ కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది. దర్శకనిర్మాతలతో పాటు చిరంజీవి, వెంకటేశ్, రామ్ చరణ్ ఆ సెలబ్రేషన్స్‌లో పాల్గొని కేక్ కట్ సందడి చేశారు.

## నేనెందుకు క్షమాపణలు చెప్పాలి: మైలకా అరోరా

ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.



# పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

### తదుపరి ప్రాజెక్ట్ కోసమే అన్న ఊహాగానాలు

సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టి.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.



# తుంబాడ్ దర్శకుడి మరో మూవీ మయసభ

తుంబాడ్' వంటి కల్ట్ క్లాసిక్‌ను అందించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే నుంచి మరో సంచలనం రాబోతోంది. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'మయసభ'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్. 'తుంబాడ్' తరహాలోనే ఈ సినిమాలో కూడా ఒక విభిన్నమైన ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తున్న జావేద్ జాఫ్రీ గతంలో ఎన్నడూ చూడని విధంగా ఒక కొత్త అవతారంలో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. వీణా జమ్కర్, దీపక్ దామ్లే, మొహమ్మద్ సమద్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**





# సంక్రాంతి నుంచైనా జగన్ బుద్ధి మారాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి
- కూటమి పాలనతో ప్రజల్లో మరింత ఆనందం
- ప్రపంచం మొత్తం ఏపీవైపు చూస్తోంది
- అసూయతో రగిలిపోతున్న జగన్ : మంత్రి సవిత
- పెనుకొండలో ఘనంగా సంక్రాంతి సంబరాలు
- ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వందలాది మంది మహిళలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- ఎద్దు బండ్ల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న రైతులు
- ఆకట్టుకున్న గంగిరెద్దుల విన్యాసాలు

**పెనుకొండ/శ్రీసత్యసాయి, జనవరి 14 (సమయం న్యూస్)**

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, అమలవుతున్న సంక్షేమాన్ని చూసి జగన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని, ఈ భోగి నుంచైనా ఆయన బుద్ధి మారాలని ఆకాంక్షించారు. బుధవారం పెనుకొండ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆర్డీవో ఆనందరావు పాల్గొన్నారు.ఎద్దుల బండ్ల పోటీలు, ముగ్గుల పోటీలను, ఇతర క్రీడలను మంత్రి వీక్షించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. కుటుంబ సభ్యుల నడుమ సంక్రాంతి సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారన్నారు. పంట చేతికొచ్చిన సమయమని, రైతులు ఉత్సాహంతో సంక్రాంతిని జరుపుకుంటున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమ, అభివృద్ధి పాలనతో ప్రజల మరింత ఆనందంగా ఉన్నారన్నారు. ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోందన్నారు. సమర్థవంతమైన నాయకత్వంలో ఉన్న ఏపీకి భారీగా పెట్టుబడులు తరలొస్తున్నాయన్నారు. ప్రజలంతా ఆనందంగా ఉన్నా, ఒకరు మాత్రమే అసూయతో రగిలిపోతున్నారంటూ జగన్ పై ఆమె విమర్శలు గుప్పించారు. కొత్తదనాన్ని ఆహ్వానించడమే భోగి ఉద్దేశమని, ఈ పండగ నుంచైనా జగన్ బుద్ధి మారాలని కోరుకుంటున్నట్లు మంత్రి సవిత అన్నారు. అంతకుముందు మంత్రి సవిత సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడానికి క్యాంపు కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకూ ఎద్దుల బండిలో భారీ ర్యాలీగా వచ్చారు.

### ఘనంగా సంక్రాంతి సంబరాలు

పెనుకొండ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సంక్రాంతి ఘనంగా జరిగాయి. వందలాది మంది మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. మహిళలు అందమైన రంగవల్లులను అలంకరించారు.గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు అకట్టుకున్నాయి. ఎద్దుల బండ్ల పోటీలు, ఇతర క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహం పాల్గొన్నారు. మంత్రి సవిత క్రీడాకారులను ప్రోత్సహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న శ్రీదేవికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పద్మావతికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన అనసూయకు రూ.5 వేలు అందజేశారు. ఇద్దరికి కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు సంక్రాంతి కానుకగా బహుమానాలు అందజేశారు. క్రీడలతో పాటు కోలాటం, చెక్కల భజన, గోరెవయ్యాల నాట్యం, పొట్టేళ్ల పందాలు, గాలిపటం ఎగరవేయడం, డోలు ప్రదర్శన వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి . ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు,అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..






# భోగి మంటల్లో గత ప్రభుత్వ పాసుపుస్తకాలు

- గొల్లపూడిలో వినూత్న నిరసన
- చెడును విడిచి మంచిని ఆహ్వానిస్తున్నాం: మంత్రి కొలుసు పార్థసారథి
- రైతుల కష్టాలు మంటల్లో కాలిపోవాలి
- గొల్లపూడిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు.. పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

**విజయవాడ - సమయం న్యూస్**

ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలోని గొల్లపూడి వన్ సెంటర్ వద్ద సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున జరిగిన భోగి వేడుకల్లో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వారిద్దరూ కలిసి సంప్రదాయబద్ధంగా భోగి మంటలను వెలిగించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను భోగి మంటల్లో వేసి రైతులు వినూత్నంగా నిరసన తెలిపారు.

### రైతులకు కొత్త ఆశలు..

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు పాసుపుస్తకాల విషయంలో తీవ్ర క్షోభను అనుభవించారని, వారి జీవితాల్లోని అనిశ్చితి, అవమానాలకు కారణమైన ఆ పాత పుస్తకాలను భోగి మంటల్లో వేసి, కొత్త ఆశలకు నాంది పలుకుతున్నారని అన్నారు. భోగి మంటలు అంటేనే చెడును విడిచి మంచిని ఆహ్వానించే సంప్రదాయానికి ప్రతీక అని, అదే స్ఫూర్తితో రైతులు తమ బాధాకర అనుభవాలకు ముగింపు పలుకుతున్నారని పేర్కొన్నారు.

### ముఖ్యమంత్రి పాలన భేష్..

రైతుల శ్రేయస్సే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తోందన్నారు. ధాన్యం విక్రయించిన డబ్బులను ఇరవై నాలుగు (24) గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. రాష్ట్రంలో యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువస్తున్నామని చెప్పారు. తెలుగు ప్రజల జీవితాల్లోని కష్టాలు భోగి మంటల్లో దగ్ధమై, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

### ప్రతి ఇంటా వెలుగులు..

ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ శాంతి, సుస్థిరతలతో పండుగ జరుపుకుంటున్నారని అన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసిన గత పాలన తాలూకు ఆనవాళ్లు మంటల్లో కాలిపోవాలన్నారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని, మైలవరం నియోజకవర్గ ప్రజలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇందిరా ధనరాజ్ మృతి పట్ల పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి

- సాహితీ లోకానికి ఆమె సేవలు ఆదర్శనీయం
- దేశం నుంచి నోబెల్ కు నామినేట్ అయిన తొలి కవయిత్రిగా గుర్తింపు

**అమరావతి - సమయం న్యూస్**

ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్ర శర్మ సతీమణి, ప్రముఖ కవయిత్రి శ్రీమతి ఇందిరా ధనరాజ్ గిర్ తుదిశ్వాస విడవడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సాహితీ రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ మంగళవారం ఒక సంతాప ప్రకటన విడుదల చేశారు.

భాషా పాండిత్యం – సాహితీ సేవ హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ఇందిరా ధనరాజ్ గిర్ గొప్ప పాండిత్యం సంపాదించారని పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఆమె సాహితీ సేవ ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందీ అకాడమీకి మొదటి అధ్యక్షురాలిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తుచేశారు. మన దేశం నుంచి ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారానికి నామినేట్ అయిన తొలి కవయిత్రిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు.

### శేషేంద్ర శర్మకు తోడుగా..

తన భర్త, ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ సాహితీ యాత్రలో ఇందిరా గారి పాత్ర చిరస్మరణీయమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. శేషేంద్ర శర్మ రాసిన వేలాది ఉత్తరాలను భద్రపరిచి, వాటితో ఒక ప్రత్యేక గ్యాలరీని నిర్వహించడం ఆమె సాహితీ అభిరుచికి నిదర్శనమని అన్నారు. శ్రీమతి ఇందిరా ధనరాజ్ గిర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.



# ఘనంగా హజరత్ సయ్యద్ యాకూబ్ జాన్ ఉర్సు

- పిచ్చుకగుంట దర్గాలో భక్తిశ్రద్ధలతో వేడుకలు
- హాజరైన ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు కో-ఆప్షన్ సభ్యులు
- పాల్గొన్న కార్పొరేటర్లు, స్థానిక ప్రముఖులు




**కాకినాడ - సమయం న్యూస్**

కాకినాడ నగరంలోని తొమ్మిదవ (9వ) డివిజన్ పిచ్చుకగుంట ప్రాంతంలో వెలసిన హజరత్ సయ్యద్ యాకూబ్ జాన్ మహాత్ముల వారి దర్గాలో ఉర్సు ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. మంగళవారం జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఉర్సు మహోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏలూరు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్.ఎమ్.ఆర్. పెదబాబు, ఏపీఎస్ఆర్టీసీ (ఆర్టీసీ) జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, బాబా వారిని దర్శించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఇటువంటి ఉత్సవాలు జరగడం సంతోషకరమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాసరావు, పాము శామ్యూల్, ఈదుపల్లి పవన్, మాజీ కార్పొరేటర్ జిజ్జువరపు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు

- పాడిపంటలతో పల్లెలు కళకళలాడాలి
- ఆధునికత ఉన్నా సంప్రదాయాలను మరువవద్దు
- రైతుల సంక్షేమానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది




**అమరావతి - సమయం న్యూస్**

సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర పర్వదినం 'మకర సంక్రాంతి' సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ప్రజలకు పండుగ సందేశాన్ని అందించారు. విశిష్టమైన ఈ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు సీఎం తెలిపారు. పాడిపంటలతో పల్లె సీమలు మరింత కళకళలాడాలని ఆకాంక్షించారు. సమాజం ఎంత ఆధునికతను సంతరించుకున్నప్పటికీ, మన మూలాలైన సంప్రదాయాలను మరచిపోకుండా పాటించాలని ప్రజలకు సూచించారు. ఈ పండుగ సందర్భంగా రైతన్నలు ఆనందంగా ఉండాలని, కష్టజీవులు తమ శ్రమకు తగిన ఫలితాన్ని పొందాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం, కష్టజీవుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుందని, వారికి అనువైన పథకాలను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. అందరూ సంక్రాంతిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు.

# రోశయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- దివంగత నేత సతీమణి శివలక్ష్మి మృతి పట్ల తీవ్ర సంతాపం
- కుమారుడు కొణిజేటి శివతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం
- కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు

**అమరావతి - సమయం న్యూస్**

దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య సతీమణి కొణిజేటి శివలక్ష్మి సోమవారం తెల్లవారుజామున కన్నుమూసిన విషయం విదితమే. ఈ విషాద సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రోశయ్య కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. రోశయ్య కుమారుడు కొణిజేటి శివతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు. మాతృవియోగం పట్ల తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తల్లి మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కొణిజేటి రోశయ్యతో, వారి కుటుంబంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని, జ్ఞాపకాలను ముఖ్యమంత్రి గుర్తుచేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## భూగర్భ జల, జలగణన శాఖ సంచాలకులుగా బాధ్యతల స్వీకరణ

**కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రికి పూర్తి అదనపు బాధ్యతలు**

**ముప్పై నాలుగు ఏళ్ల అపార అనుభవం.. ఐ.ఐ.టి గోల్డ్ మెడలిస్ట్**

**విజయవాడలో పదవీ బాధ్యతలు చేపట్టిన అధికారి**

**విజయవాడ - సమయం న్యూస్**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూగర్భ జల మరియు జలగణన శాఖ నూతన సంచాలకులుగా (డైరెక్టర్) కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ హనుమాన్ పేటలోని భూగర్భ జలశాఖ సంచాలకుల కార్యాలయంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా)లో జాయింట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న ఆయనకు, భూగర్భ జలశాఖ సంచాలకులుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. సుబ్బరాయ శాస్త్రికి భూగర్భ జలాల అంచనా, వర్గీకరణ, మౌల్యాంకనం రంగాలలో ముప్పై నాలుగు (34) సంవత్సరాలకు పైగా విశేష అనుభవం ఉంది. 1991లో అసిస్టెంట్ హైడ్రోజియాలజిస్ట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, తన పనితీరుతో అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతులు పొందారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేసి భూగర్భ జలశాఖ అభివృద్ధికి కృషి చేశారు. ముఖ్యంగా నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగం, ఫీల్డ్ సర్వేలు, ఆధునిక డేటా సాంకేతికతను వినియోగించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సుబ్బరాయ శాస్త్రి విద్యాభ్యాసంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన ఆయన, ప్రతిష్టాత్మక ఐ.ఐ.టి. రూర్కీ నుంచి ఇంజనీరింగ్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. అక్కడ విశ్వవిద్యాలయ స్థాయిలోనే బంగారు పతకం (గోల్డ్ మెడల్) సాధించడం విశేషం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాఖలోని అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

## పదిహేనవ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు పచ్చజెండా!

**నెలాఖరులోపు వెయ్యి కోట్లు విడుదల**

**వచ్చే నెలలో మిగిలిన నిధులు.. కేంద్రం నుంచి సమాచారం**

**అమరావతి - సమయం న్యూస్**

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఊపిరిపోసేలా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన 'పదిహేనవ ఆర్థిక సంఘం' నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. పంచాయతీలకు రావాల్సిన రెండు వేల ఐదు వందల (2,500) కోట్ల పెండింగ్ నిధుల్లో, ఈ నెలాఖరులోపు కనీసం వెయ్యి కోట్లు రానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి సమాచారం అందింది. మిగిలిన నిధులను వచ్చే నెలలో విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నిధుల వినియోగానికి సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అన్ని జిల్లాలకు మెమో జారీ చేస్తూ కఠిన మార్గదర్శకాలను విడుదల చేసింది. పదిహేనవ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించింది. దీని ప్రకారం.. ప్రతి గ్రామ పంచాయతీ తప్పనిసరిగా ఒక ప్రత్యేక బ్యాంకు ఖాతాను నిర్వహించాలి. ఆ ఖాతాను 'పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (పి.ఎఫ్.ఎం.ఎస్) పోర్టల్‌లో నమోదు చేసి, ఒక ప్రత్యేకమైన కోడ్ (యూనిక్ ఏజెన్సీ కోడ్) పొందాలి. అలాగే 'ఈ-గ్రామ్ స్వరాజ్' పోర్టల్ లో కూడా ఈ బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. నిధుల లావాదేవీల్లో ఉప సర్పంచ్ 'మేకర్' గా, సర్పంచ్ 'చెకర్' గా వ్యవహరిస్తారు. వీరిద్దరి డిజిటల్ సంతకాలను 'ఈ-గ్రామ్ స్వరాజ్' లో నమోదు చేసి, సంబంధిత ఎం.పి.డి.ఓ (మండల పరిషత్ అభివృద్ధి అధికారి) ద్వారా ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కోసం 'క్లాస్-3 డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్లు' తప్పనిసరి అని అధికారులు తెలిపారు. సైనింగ్, ఎన్‌క్రిప్షన్ సౌకర్యంతో పాటు 'యూ.ఎస్.బి టోకెన్' కూడా ఉండాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.

**ప్రక్రియ పూర్తయితేనే నిధులు..**

పైన పేర్కొన్న డిజిటల్ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాతే, విడుదలైన ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకునే అవకాశం ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ తేల్చి చెప్పింది. అందువల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లా పంచాయతీ అధికారులు వెంటనే అవసరమైన డిజిటల్ సంతకాలను 'జి.ఈ.ఎం' (జెమ్) పోర్టల్, ఈ-ప్రొక్యూర్‌మెంట్ లేదా ఇతర టెండర్ విధానాల ద్వారా సేకరించాలని పంచాయతీ రాజ్ కమిషనర్ శ్రుతి ఓజా ఆదేశించారు

## ఇకపై 'స్వర్ణ' సచివాలయాలు.. న్యాయశాఖ ఆర్డినెన్స్ జారీ

**గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మారుస్తూ అధికారిక ఉత్తర్వులు**

**అమరావతి - సమయం న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు న్యాయశాఖ అధికారికంగా ఆర్డినెన్స్ జారీ చేసింది. గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చాయి. తాజా ఆర్డినెన్స్ ప్రకారం ఇకపై రాష్ట్రంలోని సచివాలయాలను ఈ కింది విధంగా పిలవనున్నారు. ఇక నుంచి వీటిని "స్వర్ణ గ్రామ సచివాలయాలు"గా వ్యవహరిస్తారు. పట్టణ ప్రాంతాల్లోని వీటిని "స్వర్ణ వార్డు సచివాలయాలు"గా పిలుస్తారు. పూర్తయిన చట్ట సవరణ ప్రక్రియ సచివాలయాల పేరు మార్పు ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం (క్యాబినెట్) ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయానికి చట్టబద్ధత కల్పిస్తూ, చట్ట సవరణ ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం, గవర్నర్ ఆమోదంతో తాజాగా ఆర్డినెన్స్ ను విడుదల చేసింది. దీంతో ఇకపై అన్ని ప్రభుత్వ రికార్డుల్లోనూ, బోర్డుల పైనా కొత్త పేర్లే కనిపించనున్నాయి.


## రూ.50వేల ఇంజెక్షన్ ఫ్రీ

**తిరుపతి, జనవరి14 ( సమయం న్యూస్):**

బ్రెయిన్ స్ట్రోక్ అత్యంత ప్రమాదకరం. చికిత్సకు రూ.లక్షలు ఖర్చు చేయాలి. తిరుపతి రుయాలో ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. మంగళ, శుక్రవారం న్యూరాలజీ ఓపీ ఇస్తారు. అత్యవసర వైద్యం 24గంటలు అందిస్తారు. చేయి, కాలు, మాట పడిపోవడం, మూతి వంకర పోవడం, కళ్లు కనిపించకపోవడం బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు. సకాలంలో గుర్తించి ఇక్కడికి తీసుకొస్తే రూ.50వేల విలువైన ఇంజెక్షన్ వేస్తారు. 90శాతం ప్రాణాపాయం తప్పుతుంది

# వైద్య సేవల్లో 'పీపీపీ' మంత్రం.. రాష్ట్రానికి కేంద్రం లేఖ

- ఐదు రకాల సేవలను ప్రైవేట్ భాగస్వామ్యంతో విస్తరించాలని సూచన
- డిమాండ్, లభ్యత మధ్య అంతరాన్ని తగ్గించే వ్యూహం
- రాష్ట్రానికి 14 క్యాన్సర్ డే కేర్ సెంటర్లు మంజూరు



**అమరావతి - సమయం న్యూస్**

ప్రజలకు వైద్య, ఆరోగ్య సేవలను మరింత విస్తృత స్థాయిలో, నాణ్యంగా అందించేందుకు 'ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం' (పిపిపి) విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసింది. వైద్య సేవల డిమాండ్, లభ్యత మధ్య ఉన్న అంతరాన్ని పూరించడానికి పిపిపి విధానమే శరణ్యమని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి విజయ్ నెహ్రా, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు ఈ నెల పన్నెండున రాసిన లేఖలో పలు కీలక సూచనలు చేశారు. దీనికి సంబంధించి ఇరవై ఏడు పేజీల సమగ్ర మార్గదర్శకాలను కూడా రాష్ట్రానికి పంపించారు. గతంలో కేంద్ర మంత్రి జె.పి. నడ్డా వైద్య విద్య విస్తరణపై రాసిన లేఖకు కొనసాగింపుగా ఈ తాజా లేఖ ఉంది.

ప్రధానంగా న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్య శాలలు, దంత వైద్యం, రేడియాలజీ సేవలు, క్యాన్సర్ డే కేర్ సెంటర్లు అనే ఐదు అంశాలలో పిపిపి విధానాన్ని అవలంబించాలని కేంద్రం సూచించింది. పరికరాలను సమకూర్చడం, నిర్వహించడం (ఈ.ఓ.ఎం) మరియు నిర్వహణ బాధ్యతలు (ఓ అండ్ ఎం) వంటి పద్ధతుల ద్వారా ఐదు నుంచి పది సంవత్సరాల కాలపరిమితితో ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని పేర్కొంది.

**గ్రామీణ స్థాయికి అత్యాధునిక వైద్యం**

ముఖ్యంగా క్యాన్సర్, గుండె, నరాల సంబంధిత వ్యాధుల చికిత్సలో కీలకమైన న్యూక్లియర్ మెడిసిన్ సేవలు ప్రస్తుతం మధ్య, చిన్న స్థాయి నగరాల్లో అంతగా అందుబాటులో లేవు. ఈ కొరతను తీర్చడానికి పిపిపి పద్ధతిలో గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోకి 'పెట్-సి.టి', 'స్పెక్ట్ ఇమేజింగ్', రేడియో థెరపీ వంటి అత్యాధునిక సేవలను తీసుకురావాలని కేంద్రం అభిప్రాయపడింది. అలాగే వ్యాధి నిర్ధారణలో ఎంతో కీలకమైన ఎక్స్‌రే, సి.టి, ఎం.ఆర్.ఐ స్కానింగ్ యంత్రాల లభ్యతను కూడా ఇదే పద్ధతిలో విస్తృతం చేయాలని సూచించింది.

**దంత వైద్యం - క్యాన్సర్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి**

మరోవైపు దేశ జనాభాలో అరవై నుంచి తొంభై శాతం మంది వివిధ రకాల దంత సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వారికి సరైన వైద్యం అందడం లేదని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పరికరాలు, వైద్యుల కొరత ఉన్నందున, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే పిపిపి ద్వారా దంత వైద్య సేవలను బలోపేతం చేయాలని కోరింది. ఇక వేగంగా విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారిని కట్టడి చేయడానికి ముందస్తు పరీక్షలు, వ్యాధి నిర్ధారణ కోసం 'డే కేర్ సెంటర్లు' ఏర్పాటు చేయాలని తెలిపింది. రెండు వేల ఇరవై ఏడు నాటికి దేశంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సెంటర్లు ఉండాలన్నది లక్ష్యమని, ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే ఏడాదికి (2025-26) పద్నాలుగు సెంటర్లను మంజూరు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఈ లేఖలోని అంశాలను కార్యదర్శి సౌరభ్ గౌర్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లారు.

# అంటువ్యాధుల గుర్తింపులో ఇక ప్రజలదే కీలక పాత్ర

- ఐ.హెచ్.ఐ.పి వెబ్ లింక్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- క్షణాల్లో అంచెలంచెలుగా అధికారులకు సమాచారం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వినూత్న నిర్ణయం




**అమరావతి - సమయం న్యూస్**

అంటువ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, తక్షణమే అరికట్టేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. వ్యాధుల గుర్తింపులో ప్రజలను కూడా ప్రత్యక్ష భాగస్వాములను చేస్తోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 'డిసీజ్ సర్వైలెన్స్' (వ్యాధుల పర్యవేక్షణ) కార్యక్రమంలో భాగంగా రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్' (ఐ.హెచ్.ఐ.పి) వెబ్ లింక్ ద్వారా ఇకపై నేరుగా ప్రజల నుంచే ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు.

**జాప్యాన్ని నివారించేందుకే..**

కొన్ని ప్రాంతాల్లో పరిసరాల అపరిశుభ్రత, మురుగునీటి వ్యవస్థ సరిగా లేకపోవడం, తాగునీరు కలుషితం కావడం వంటి కారణాల వల్ల ప్రజలు మూకుమ్మడిగా వాంతులు, విరేచనాలు వంటి అంటువ్యాధుల బారిన పడుతున్నారు. అయితే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ఆ సమాచారం పైస్థాయి అధికారులకు చేరడంలో కొన్నిసార్లు జాప్యం జరుగుతోంది. దీనివల్ల నష్టం వాటిల్లుతోంది. దీనిని అధిగమించే చర్యల్లో భాగంగానే, వ్యాధుల నియంత్రణలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**ఫిర్యాదు చేయడం ఇలా..**

ప్రభుత్వం సూచించిన ఐ.హెచ్.ఐ.పి వెబ్ లింక్ ద్వారా రాష్ట్రంలోని ఏ జిల్లా వారైనా తమ ప్రాంతంలో వ్యాధులు ప్రబలుతున్నా, లేదా వ్యాధుల ఉధృతి ఎక్కువగా ఉన్నా ఆ వివరాలను నమోదు చేయవచ్చు. వెబ్ సైట్ లో స్క్రీన్ పై కనిపించే గడులలో (ఎంట్రీ ఫీల్డ్స్) సమాచారం నింపడంతో పాటు, అక్కడి పరిస్థితులకు సంబంధించిన ఫోటోలను కూడా అప్లోడ్ చేసే సౌకర్యం కల్పించారు.

**వెంటనే అప్రమత్తత..**

ప్రజలు ఈ వెబ్ లింక్ లో సమాచారం నమోదు చేసిన మరుక్షణమే ఆ వివరాలు సంబంధిత ఏ.ఎన్.ఎమ్ కు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారికి, జిల్లా అధికారులకు మరియు రాష్ట్ర స్థాయి అధికారులకు ఒకేసారి చేరుతాయని కమిషనర్ వివరించారు. ఈ హెచ్చరికల (అలర్ట్స్) ఆధారంగా క్షేత్రస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు యంత్రాంగం వెంటనే అప్రమత్తమై చర్యలు చేపడుతుంది. ప్రజలందరూ ఈ కొత్త అవకాశాన్ని వినియోగించుకుని అంటువ్యాధుల నివారణకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అలరించిన చిన్నారుల నృత్యాలు.. బాల గంగాధర్ తిలక్‌కు ఘన సన్మానం

- విజయవాడలో వైభవంగా వివేకానంద జయంతి వేడుకలు
- ఆయలపురం హోటల్‌లో యువజనోత్సవ సంబరాలు
- పాల్గొన్న ముఖ్యమంత్రి సలహాదారు కోమటి జయరాం, ఇతర ప్రముఖులు








**విజయవాడ - సమయం న్యూస్**

స్వామి వివేకానంద జయంతి మరియు యువజనోత్సవ వేడుకలు విజయవాడలోని ఆయలపురం హోటల్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా బాలబాలికలు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, నాట్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. చిన్నారుల ప్రతిభను చూసి అతిథులు మంత్రముగ్ధులయ్యారు.

**ఘనంగా సత్కారం**

ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత (రిటైర్డ్) జాయింట్ డైరెక్టర్ మామిడిపల్లి బాల గంగాధర్ తిలక్‌ను ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సలహాదారు శ్రీ కోమటి జయరాం, తెలుగుదేశం పార్టీ (టి.డి.పి) ఎన్.ఆర్.ఐ విభాగం నాయకులు చప్పిడి రాజశేఖర్, శ్రీశ్రీ అంతర్జాతీయ సాహితీ సమాఖ్య సి.ఇ.ఓ కె. ప్రతాప్, అద్దంకి యోనా రాజ్, పాన్ ఇండియా ఫిలాంత్రపిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. వీరంతా కలిసి బాల గంగాధర్ తిలక్‌ను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు.